# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 30 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 22 మార్చి 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 30 22-03-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-








3వ పేజీలో



తిరుమల అన్నప్రసాద వితరణకు నారా కుటుంబం

**రూ.44 లక్షల విరాళం**



శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబు కుటుంబం.. మరిన్ని చిత్రాలు

3వ పేజీలో

# ఏడు కొండలు... వెంకటేశ్వరస్వామి సొంతం

- తిరుమలలో సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- భక్తులకు స్వయంగా వడ్డిస్తే కలిగే తృప్తి వెలకట్టలేనిదని వెల్లడి
- గత ఐదేళ్లలో అనేక దారుణాలు జరిగాయని వ్యాఖ్యలు
- తిరుమల నుంచే ప్రక్షాళన ప్రారంభించామని స్పష్టీకరణ



**అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

నారా దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సీఎం చంద్రబాబు కుటుంబం ప్రస్తుతం తిరుమలలో ఉన్న సంగతి తెలిసిందే. అన్నప్రసాద కేంద్రంలో మనవడి పేరిట అన్న వితరణ చేసిన అనంతరం చంద్రబాబు స్థానిక పద్మావతి అతిథి గృహంలో కీలక సమీక్ష చేపట్టారు. తిరుమల అభివృద్ధిపై టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఇతరు అధికారులతో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, తిరుమలకు నిత్యం వేల సంఖ్యలో భక్తులు వస్తున్నారని, అన్నదానానికి చాలామంది విరాళాలు ఇస్తున్నారని వెల్లడించారు. భక్తులకు అన్నప్రసాదాలు స్వయంగా వడ్డిస్తే కలిగే తృప్తి వెలకట్టలేనిదని అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ హితం కోసం పనిచేయాలని సూచించారు. ఏడు కొండలు వెంకటేశ్వరస్వామి సొంతం అని స్పష్టం చేశారు. ఏడు కొండల్లో ఎలాంటి అపవిత్ర కార్యక్రమాలు జరగరాదని అన్నారు. గడచిన ఐదేళ్లలో చాలా దారుణాలు జరిగాయని, తిరుమల నుంచే ప్రక్షాళన చేస్తానని ఎన్నికల వేళ చెప్పానని... అధికారంలోకి వచ్చాక ఆ మేరకు చర్యలు తీసుకున్నానని వివరించారు. అప్పట్లో ఏడు కొండలను ఆనుకుని ముంతాజ్ హొటల్ కు అనుమతి ఇచ్చారని, ఆ హొటల్ కు 20 ఎకరాలు కేటాయించారని చంద్రబాబు విమర్శించారు. దీనిపై తాము చర్యలు తీసుకున్నామని, మరో 35.32 ఎకరాల్లో వివిధ సంస్థలకు భూ కేటాయింపులను కూడా రద్దు చేశామని తెలిపారు. ఏడు కొండలను ఆనుకుని వాణిజ్యపరమైన అంశాలకు అనుమతించేది లేదని ఉద్ఘాటించారు. వ్యక్తిగత ప్రయోజనాలకు

- తరువాయి 2లో..



## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు ఆగ్రహం

**అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

తెలుగు రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు అసెంబ్లీకి హాజరుకాకుండా జీతం తీసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ అంశాన్ని అసెంబ్లీలో లేవనెత్తగా, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఇదే విషయం పై మాట్లాడారు.

**వైసీపీ ఎమ్మెల్యేలపై చంద్రబాబు, స్పీకర్ అయ్యన్నపాత్రుడు విమర్శలు**

అసెంబ్లీ సమావేశాలు ప్రజా సమస్యలపై చర్చించేందుకు, పాలనలో పారదర్శకత

- తరువాయి 2లో..



## టెన్త్, ఇంటర్ ఫలితాలు మొబైల్ లోనే చూసుకోవచ్చు : నారా లోకేశ్

**అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం "మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ 2.0" వెర్షన్‌ను మరిన్ని సేవలకు అనుసంధానించనున్నట్లు విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ శాసనసభలో వెల్లడించారు. ఈ ఏఐ ఆధారిత వర్షన్‌ను జూన్ 30 నాటికి అందుబాటులోకి తేవడం జరుగుతుంది. ఈ కొత్త వెర్షన్ ద్వారా వాయిస్

- తరువాయి 2లో..




## ఏపీ అసెంబ్లీకి కమిటీలను ప్రకటించిన స్పీకర్

**అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి సంబంధించిన వివిధ కమిటీలను అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఇప్పటికే అసెంబ్లీలో ముఖ్యమైన ఆర్థిక కమిటీలైన పీఏసీ, పీయూసీ, అంచనాల కమిటీలను జనవరి చివరిలో నియమించిన సంగతి తెలిసిందే. తాజాగా, ఆర్థికేతర కమిటీలను కూడా ప్రకటించారు. ఇందులో రూల్స్ కమిటీ, ప్రివిలేజ్ కమిటీ, పిటిషన్ల కమిటీ, ఎథిక్స్ కమిటీ, ప్రభుత్వ హామీల కమిటీ, సహకార బ్యాంకుల అవకతవకలపై ప్రత్యేక కమిటీలు

- తరువాయి 2లో..



## ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవ తీర్మానంలో చంద్రబాబుదే కీలక పాత్ర: మందకృష్ణ

**అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై ఏపీ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేయడం చారిత్రక విజయమని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవ తీర్మానంలో చంద్రబాబుదే కీలక పాత్ర అన్నారు. 1997-98లో తొలిసారి తీర్మానం ప్రవేశపెట్టిన ఘనత చంద్రబాబుదేనన్నారు. ఈ విజయం 30 ఏళ్ల పోరాటంలో అమరులైన వారికి అంకితం చేస్తున్నట్లు చెప్పారు. ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవ తీర్మానంలో చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేశారు 1996లో మహాసభకు వచ్చి ఎస్సీ వర్గీకరణకు తొలిసారి హామీ

- తరువాయి 2లో..

## పోసానికి ఊరట.. బెయిల్ మంజూరు



**అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

వైసీపీ నేత, సినీ నటుడు పోసాని కృష్ణ మురళికి ఊరట లభించింది. పోసానికి గుంటూరు సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. చంద్రబాబు, పవన్, లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో పోసాని అరెస్ట్ అయ్యారు. ప్రస్తుతం గుంటూరు జిల్లా జైల్లో జ్యూడిషియల్ రిమాండ్‌లో ఉన్నారు. ఈనెల 23 వరకు రిమాండ్ విధించారు. అలాగే ఈ కేసులో పోసానిని సీఐడీ అధికారులు ఒకరోజు పాటు కస్టడీలోకి తీసుకుని విచారించారు. కస్టడీ విచారణ అనంతరం కూడా మరోసారి కస్టడీకి తీసుకునేందుకు సీఐడీ అధికారులు ప్రయత్నించారు. అయితే

- తరువాయి 2లో..



## మే నెలాఖరులోగా విశాఖ మెట్రో టెండర్లు పూర్తి: మంత్రి నారాయణ

**అమరావతి మార్చి 18 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ విశాఖ కొత్త మాస్టర్ ప్లాన్‌పై సచివాలయంలో అధికారులు, విశాఖ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాలుగు నెలల్లో విశాఖ మహానగర పాలక సంస్థ కొత్త మాస్టర్ ప్లాన్ తయారు చేస్తామని చెప్పారు. మే నెలాఖరులోగా విశాఖ మెట్రో రైలు టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఫైనాన్షియల్ సిటీ విశాఖ మాస్టర్ ప్లాన్‌పై సమీక్షించినట్లు తెలిపారు. ప్రజలు, నేతల అభిప్రాయాలతో నాలుగు నెలల్లో కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందించనున్నట్లు తెలిపారు. విశాఖ మెట్రో రైల్‌పైనా సమావేశంలో చర్చించామన్నారు. టీడీఆర్ బాండ్ల విషయంలో గతంలో అక్రమాలు జరిగాయని.. విశాఖలో 600కు పైగా టీడీఆర్ బాండ్లు పెండింగ్‌లో ఉన్నట్లు చెప్పారు. వీటిని విశాఖ కలెక్టర్ త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయానికి ఇబ్బంది లేకుండా రోడ్లు ఏర్పాటు చేస్తామన్నారు. వైసీపీ హయాంలో మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా డీవియేషన్ జరిగిందని మంత్రి తెలిపారు.

# సంపాదకీయం

## సిరియాను కుదుటపడనివ్వరా?

**అరవై సంవత్సరాలపాటు అస్సాద్ వంశ నియంతృత్వంలో మగ్గి గత డిసెంబర్‌లో విముక్తి చెందిన సిరియా ప్రజలు కుదుట పడేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ అందుకు రెండు శక్తుల నుంచి సవాళ్లు ఎదురవుతు న్నాయి. ప్రజల తిరుగుబాటుతో దేశం విడిచి పారిపోయిన బషార్ అల్%-% అస్సాద్, ఇజ్రాయెల్! అస్సాద్ సవాలు కనీసం పరోక్షమై నది, ఇజ్రాయెల్‌ది ప్రత్యక్షమైనది.**

డిసెంబర్ మొదటి వారంలో అస్సాద్ పతనం తర్వాత సిరియాను మరిచిపోయిన ప్రపంచం, పది రోజుల క్రితం అకస్మాత్తుగా పెద్ద ఎత్తున సాయుధ ఘర్షణ వార్తలు రావటంతో ఉలిక్కిపడింది. ఆ విధంగా దృష్టి ఉక్రెయిన్ యుద్ధం నుంచి కొద్ది రోజులపాటు ఇటు మళ్లింది. వారం రోజులపాటు ఆ ఘటనలలో సుమారు 1,500 మంది చనిపోయినట్లు అంచనా. అస్సాద్ పతనానికి ముందు పది రోజులపాటు సాగిన తిరుగుబాటులోనూ అంతమంది చనిపోలేదు.

**తిరగబడిన అలావైట్ తెగ**


ఈ ఘర్షణలకు కారణం, అస్సాద్‌కు చెందిన మైనారిటీ అలావైట్ తెగవారు తిరగబడటం! వారు ప్రధానంగా సిరియాలోని పశ్చిమ ప్రాంతాన మధ్యధరా సముద్ర తీరం వెంట నివసిస్తారు. వారు తెగను బట్టి మైనారిటీ మాత్రమేగాక, మతం రీత్యానూ మైనారిటీ. దేశంలో సున్నీలది మెజారిటీ కాగా వీరు షియాలు. షియా రాజ్యమైన ఇరాన్, అస్సాద్‌ను బలపరచటానికి గల కారణాలలో ఇది కూడా ఒకటి. తిరుగుబాటు విజయవంతమైనప్పటి నుంచి అలావైట్‌లలో సహజంగానే భయం ఏర్పడింది. వారు లెబనాన్‌కు తరలి పోవటం మొదలైంది. తిరుగుబాటు నాయకుడు అహమద్ అల్%-%షరారా, అటు వంటి ఆందోళనలు అక్కర లేదనీ, దేశంలోని అన్ని తెగలు, మతాలు, వర్గాలను ఏకం చేసి దేశాన్ని ముందుకు తీసుకుపోవటం తన లక్ష్యమనీ మొదటి రోజునే ప్రకటించారు. కానీ అలావైట్ షియాలకు, సున్నీలకు మధ్య స్థానికంగా కొన్ని కలహాలు జరగగా, ఉన్నట్లుండి అలావైట్ల పక్షాన సాయుధులు రంగంలోకి దిగారు. అనివార్యంగా ప్రభుత్వ సేనలు మోహరించగా ఘర్షణలు తీవ్ర రూపం తీసుకున్నాయి. వారం రోజులలో 1,500 మంది చనిపోయినట్లు అనధికార అంచనా కాగా, ప్రభుత్వం చేసిన ప్రకటనను బట్టి వారిలో సుమారు 200 మంది సైనికులున్నారు. మిగిలిన 1,300 మందిలో అలావైట్ పౌరులు ఎందరో, సాయుధ దళాల వారెందరో తెలియదు. అస్సాద్ సైన్యంలోని ఒక దళం తిరిగి ఒకచోట చేరి దాడులు ఆరంభించింది. అది స్థానికంగా జరిగిన పరిణామమా, లేక ప్రస్తుతం రష్యాలో తలదాచుకున్న అస్సాద్ ప్రమేయ ముందా అనేది తెలియదు. అందుకు అవకాశాలు తక్కువన్నది ఒక అభిప్రాయం. ఆయనకు రష్యా మొదటి నుంచి మద్దతునివ్వటం, ప్రస్తుతం ఆశ్రయాన్నివ్వటం నిజమే అయినా, సిరియా కొత్త ప్రభు త్వంతో సత్సంబంధాలకు ప్రయత్నిస్తున్నది. మధ్యధరా సముద్రపు తూర్పు తీరాన భౌగోళికంగా కీలకమైన ప్రాంతంలో గల సిరియాలో రష్యాకు ఒక నౌకా స్థావరం, ఒక వైమానిక స్థావరం ఉన్నాయి. యూరప్‌ను ఎదుర్కొనేందుకు అవి చాలా అవసరం. అందువల్ల సిరియా కొత్త ప్రభుత్వంతో సత్సంబంధాల ద్వారా ఆ స్థావరాలను కొనసాగించేందుకు ప్రయత్నిస్తున్నారు. రష్యా ఇంతకాలం అస్సాద్‌కు పూర్తి మద్దతుగా ఉండినప్పటికీ, తమ కొత్త పరిస్థితులలో రష్యా సహాయం అనేక విధాలుగా అవసరం గనుక, అల్%-%షరారా కూడా అందుకు సుముఖత చూపుతున్నారు. ఇటువంటి పరిస్థితులలో అస్సాద్‌ను సిరియాలో తన పాత సైనిక దళాల ద్వారా ఘర్షణలకు రష్యా అనుమతించటం జరిగేది కాదు. పరోక్షంగానైనా అస్సాద్ ప్రోత్సాహం లేక ఇది జరిగేది కాదనే అభిప్రాయమూ ఉంది.

**అందరినీ ఏకం చేసే దిశగా...**

ఈ తర్కాన్ని బట్టి చూసినపుడు, ఘర్షణలకు కారణం అస్సాద్ సైన్యానికి చెందిన స్థానికమైన ఒక సైనిక దళమని భావించవలసి ఉంటుంది. అల్%-%షరారా ప్రకటించింది కూడా అదే. ఆ ఒక్క దళాన్ని చివరకు తుడిచి పెట్టామన్నారాయన. అయితే, ఇటువంటి పరిస్థితి తిరిగి తలెత్తబోదనే హామీ ఏమైనా ఉందా? దేశ నిర్మాణంలో అలావైట్లు కూడా భాగస్వాములని, వివిధ వర్గాల మధ్య ఎటువంటి తారతమ్యాలు ఉండబోవని తమ తిరుగుబాటు విజయవంతమైన మొదటిరోజునే స్పష్టం చేసిన తాత్కాలిక అధ్యక్షుడు అల్%-%షరారా, గమనార్హమైన పని ఒకటి చేశారు. అది - ఘర్షణలపై నియమించిన విచారణ కమిటీలో అలావైట్లను కూడా చేర్చటం! ఘర్షణలలో తమ వారి ప్రమేయం ఉన్నట్లు తేలితే వారిపైనా చర్యలుంటాయని ప్రత్యే కంగా చెప్పారు. ఈ వైఖరిలో రాజకీయమైన, పరిపాలనాపరమైన వివేకం కన్పిస్తాయి. సున్నీలు, షియాలు, క్రైస్తవులు, కుర్దులు, డ్రూజ్‌లు మొదలైన తెగలతోపాటు ప్రాంతాల వారీగా కూడా చీలి పోయి ఉన్న దేశాన్ని ఏకం చేయటం, ఒకటిగా ముందుకు నడిపించటం తేలిక కాదు.

# రాష్ట్రవ్యాప్తంగా ఆపరేషన్ గరుడ

**100 బృందాలతో తనిఖీలు**
**మందుల షాపులు, మందుల ఏజెన్సీలపై దాడులు**
**రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశానుసారం..**



అమరావతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా నిర్దేశానుసారం ఈగల్ టీమ్ ఐజీ మరియు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్ మెంట్, స్థానిక పోలీసు లు, డ్రగ్స్ డిపార్ట్ మెంట్ ల ఆధ్వర్యంలో టీమ్ గా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి డ్రగ్స్ దుర్వినియోగంపై మెడికల్ షాపులు, మెడికల్ ఏజెన్సీల పై దాడులు నిర్వహించామని ఈగల్ (ఎలైట్ యాంటీ-నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్ఫోర్స్మెంట్) ఐజీ ఆకే రవి కృష్ణ, తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడ ఆదేశాలతో, హోం మంత్రి వంగలపూడి అనిత సూచనలకు అనుగుణంగా ఆపరేషన్ గరుడ ను చేపట్టడం జరిగిందన్నారు. రాష్ట్ర డిజిపి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా నిలపడమే లక్ష్యం పనిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గుణదలలో మందుల షాపు వద్ద పాత్రికేయులతో ఈగల్ ఐజీ ఆకే రవి కృష్ణ మాట్లాడుతూ ఈ తనిఖీలకు ఆపరేషన్ గరుడ అని పేరు పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 100 బృందాల ఆధ్వర్యంలో ఆపరేషన్ గరుడ ను నిర్వహించినట్లు తెలిపారు. ఆపరేషన్ గరుడ లో భాగంగా శుక్రవారం ఉదయం గుణదలలో గల ముందుల షాపులో ఆకస్మిక తనిఖీ చేయడం జరిగిందన్నారు. మెడికల్ షాప్స్ లో ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు ఇవ్వకూడదని అటువంటి మందుల అమ్మకం జరుగుతుందేమో పరిశీలిస్తున్నామన్నారు. %ూాదీజుచీణ్గాఉూజు% వంటి కొన్ని మత్తు ఇచ్చే టాబ్లెట్స్ ఇంజక్షన్స్ ను కొనుగోలు చేసి యువత బానిసలుగా మారుతున్నారు.. గంజాయిని కట్టడి చేస్తున్న నేపథ్యంలో యువత ఈవిధమైన నిబంధనలకు విరుద్ధంగా మందులను కొనుగోలు చేసి వినియోగిస్తున్నట్టు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. గతంలో కంటే కట్టుదిట్టంగా ఎన్ డి పి ఎస్ యాక్ట్ ను అమలు చేస్తామన్నారు. యువత ఇలాంటి మత్తు టాబ్లెట్ లకు బానిసలు కాకుండా ఉండాలని వారికి పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు జరిపి ఇటువంటి అమ్మకాలు జరుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈగల్ ఐజీ ఆకే రవి కృష్ణ తెలిపారు. డ్రగ్స్ డైరెక్టర్ ఎంబీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేని మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మందులకు సరిగా బిల్లులు ఇవ్వని వారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రిస్క్రిప్షన్ మీద అమ్మవలసిన మందులు మాత్రమే మందుల షాపులో విక్రయించాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా మందులు అమ్మే మెడికల్ షాపులపై చర్యలు తీసుకుంటామన్నారు.



## ఏడు కొండలు... వెంకటేశ్వరస్వామి సొంతం

చోటులేదని స్పష్టంగా చెప్పామని అన్నారు. వెంకటేశ్వరస్వామి ఆస్తులన్నీ కాపడడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. తిరుమల ఆలయంలో హిందువులు మాత్రమే పనిచేయాలని స్పష్టం చేశారు. టీటీడీలో అన్యమత ఉద్యోగులను తొలగించడానికి ఆదేశాలు ఇచ్చామని వెల్లడించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో వెంకటేశ్వరస్వామి ఆలయాలు నిర్మించాలని నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఆయా రాష్ట్రాల సీఎంలు కూడా ముందుకొస్తే త్వరితగతిన ఆలయ నిర్మాణాలు చేపడతామని చెప్పారు. అంతేగాకుండా, ప్రపంచవ్యాప్తంగా హిందువులు ఎక్కువగా ఉన్న చోట ఆలయాలు నిర్మిస్తామని అన్నారు. శ్రీవారి ఆలయాల నిర్మాణం కోసం ప్రత్యేకంగా ఆలయ ట్రస్ట్ ఏర్పాటు చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఇక అన్నదానం, ప్రాణదానం తరహాలోనే మాధవ సేవ పేరుతో కొత్త కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు.

## అసెంబ్లీకి రాని ఎమ్మెల్యేలపై రెండు తెలుగు రాష్ట్రాల సీఎంలు ఆగ్రహం

తీసుకురావడానికే ఏర్పాటు చేయబడతాయి.అయితే, వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా, కేవలం హాజరు రిజిస్టర్‌లో సంతకాలు చేసుకుని వెళ్లిపోవడం ప్రజాస్వామ్యానికి తగదని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. “వైసీపీ సభ్యులు కొంత మంది అసెంబ్లీలో కనిపించకుండా రిజిస్టర్‌లో మాత్రం సంతకాలు చేశారు,అని చంద్రబాబు తెలిపారు.గవర్నర్ ప్రసంగం తర్వాత వైసీపీ ఎమ్మెల్యేలు బడ్జెట్ సమావేశాలకు రాకపోవడం ప్రజల పక్షాన పని చేయకపోవడమే అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు మండిపడ్డారు.ధైర్యంగా సభకు రాలేరా? దొంగల్లా వచ్చి సంతకాలు చేయడం ఎందుకు,అని ఆయన వైసీపీ సభ్యులను ప్రశ్నించారు.

**కేసీఆర్‌పై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఫైర్**

తెలంగాణలో కూడా ఇదే పరిస్థితి ఉంది. మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాకుండా, ప్రజల సొమ్ముతో జీతం తీసుకోవడం తగదని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ 57 లక్షల జీతం తీసుకుని అసెంబ్లీకి రావడం లేదు. ఇది ప్రజాస్వామ్యానికి మచ్చ అని విమర్శించారు.ప్రజల సొమ్ము జీతంగా పొందుతున్న కేసీఆర్ అసెంబ్లీకి సమావేశాలకు వచ్చి తెలంగాణ అభివృద్ధికి సలహాలు ఇవ్వకుండా హౌస్‌లో ఉండిపోవడం సమంజసమా అని రేవంత్ ప్రశ్నించారు.

**ప్రజాస్వామ్యంలో ఎమ్మెల్యేల హాజరు అవసరమే**

ఎమ్మెల్యేలు ప్రజల సేవకులు.ప్రజల కష్టాలు పరిష్కరించడానికి, పాలనలో చురుకుగా పాల్గొనడానికి అసెంబ్లీలో హాజరు కావాల్సిందే.ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా జీతం తీసుకోవడమేంటని రెండు తెలుగు రాష్ట్రాల సీఎం లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వైసీపీ, బీఆర్ఎస్ సభ్యులు భవిష్యత్‌లోనైనా ఈ తీరును మార్చుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది.

**ప్రజా ప్రతినిధుల బాధ్యత**

ప్రజా ప్రతినిధులంటే ప్రజా సేవకులు వారుకూడా ఒకవిధంగా ప్రభుత్వ ఉద్యోగులే ప్రజలు కట్టే పన్నుల నుంచి ప్రతి నెలా జీత భత్యాలు తీసుకునే వారు ఎన్నుకున్న ప్రజల కోసం అసెంబ్లీ సమావేశాలకి రాకపోతే ఎలా,ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావడం తప్పనిసరి. ప్రజల కట్టే పన్నుల నుంచే వీరు జీతం తీసుకుంటారు, అందుకే సభకు హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలి

## టెన్త్, ఇంటర్ ఫలితాలు మొబైల్ లోనే చూసుకోవచ్చు : నారా లోకేశ్

సేవలు అందుబాటులోకి రానున్నాయి. అంటే వినియోగదారులు వాయిస్ కమాండ్ ద్వారా తమ అవసరమైన సేవలను పొందగలుగుతారు.

**కొత్తగా అందించనున్న సేవలు**

టెన్త్, ఇంటర్ విద్యార్థులు ఇంటి నుంచే మొబైల్ ద్వారా హాల్‌టికెట్లు అందుబాటులోకి తీసుకువచ్చిన కూటమి సర్కార్, పబ్లిక్ పరీక్షా ఫలితాలు వెలువడిన వెంటనే,వాటి ఫలితాలను కూడా వాట్సప్ గవర్నెన్స్ ద్వారా విద్యార్థుల మొబైల్ నంబర్లకు నేరుగా పంపిస్తామని చెప్పారు. అలాగే ఏఐ ఆధారిత వాయిస్ సేవలతో,బస్ టికెట్ కావాలని నోటితో చెబితే టికెట్ బుక్ చేస్తుందని, నంబర్ చెబితే కరంటు బిల్లు కట్టేస్తుందని వెల్లడించారు. ఈ సేవలు అన్ని భాషల్లోనూ అందుబాటులోకి తీసుకువస్తామని వివరించారు.

**ప్రజలకు అందుబాటులోకి డిజిటల్ సేవలు**

విద్యార్థులకు వాట్స్ యాప్ ద్వారా హాల్ టికెట్లు ఫలితాలు,బస్ టికెట్, కరెంట్ బిల్లు చెల్లింపులు వాయిస్ కమాండ్ ద్వారా,టీటీడీ సేవలను వాట్స్ యాప్ గవర్నెన్స్ ద్వారా అందుబాటులోకి తేనున్న ప్రభుత్వం, శాశ్వత ధ్రువీకరణ పత్రాలకు చట్టసవరణ ప్రణాళిక.

**అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం**

విదేశాల్లో విద్యను అభ్యసించేందుకు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద 2025-26 విద్యా సంవత్సరానికి గానూ అర్హులైన ఎస్సీ విద్యార్థులు మార్చి 20 నుంచి మే 19 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ తెలిపింది. ఆన్‌లైన్ దరఖాస్తు ఈ-పాస్ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంటాయని, చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించింది.

**అటవీ శాఖ**

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమీషన్ ( ఏపీపీఎస్సీ) ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ స్క్రీనింగ్ పరీక్ష ప్రాథమిక కీని విడుదల చేసింది.మార్చి 21 నుండి 23 వరకు అభ్యంతరాలను ఆన్‌లైన్ ద్వారా సమర్పించే అవకాశం.మార్చి 16న నిర్వహించిన పరీక్షకు 7,620 మంది హాజరయ్యారు.ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖలో 37 ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోస్టుల భర్తీ నిమిత్తం ఈ నియామక ప్రక్రియ చేపట్టారు.

## ఏపీ అసెంబ్లీకి కమిటీలను ప్రకటించిన స్పీకర్

ఉన్నాయి. రూల్స్ కమిటీ అసెంబ్లీ నియమ నిబంధనలపై కీలక నిర్ణయాలు తీసుకునే రూల్స్ కమిటీ ఛైర్మన్‌గా అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వ్యవహరిస్తారు. ఈ కమిటీలో సభ్యులుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పి.ధర్మరాజు, గద్దె రామ్మోహన్‌రావు, కిమిడి కళా వెంకట్రావు, సుజనా చౌదరి, ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డిలను నియమించారు.

**ప్రివిలేజ్ కమిటీ**

ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్‌గా మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ కమిటీలో బండారు సత్యానందరావు, బొగ్గుల దస్తగిరి, పి.ధర్మరాజు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, మామిడి గోవిందరావు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ అసెంబ్లీ సభ్యుల హక్కులు, ప్రత్యేకాధికారాలకు సంబంధించిన అంశాలను పరిశీలిస్తుంది.

**పిటిషన్ల కమిటీ**

పిటిషన్ల కమిటీ అధ్యక్షుడిగా డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వ్యవహరిస్తారు. ఈ కమిటీలో గంటా శ్రీనివాసరావు, కొణతాల రామకృష్ణ, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పల్లా శ్రీనివాసరావు, గురజాల జగన్‌మోహన్, పెన్మత్స విష్ణుకుమార్‌రాజు సభ్యులుగా ఉన్నారు. ప్రజలు ప్రభుత్వ విధానాలపై అసెంబ్లీకి అందించే వినతులను ఈ కమిటీ సమీక్షిస్తుంది.

**ఎథిక్స్ కమిటీ**

శాసనసభ మాజీ ఉప సభాపతి, ప్రస్తుత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఎథిక్స్ కమిటీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ కమిటీలో జ్యోతుల నెహ్రూ, కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డి, బత్తుల బలరామకృష్ణ, భాష్యం ప్రవీణ్, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ముప్పిడి వెంకటేశ్వరరావు సభ్యులుగా నియమితులయ్యారు. అసెంబ్లీ సభ్యులు అనుసరించాల్సిన నైతిక ప్రమాణాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది.

**ప్రభుత్వ హామీల కమిటీ**

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రభుత్వ హామీల కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఈ కమిటీలో దామచర్ల జనార్దనరావు, గిడ్డి సత్యనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, నంద్యాల వరదరాజులరెడ్డి, కలిదిండి సూర్య నాగ సన్యాసిరాజు, అమిలినేని సురేంద్రబాబు సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన హామీల అమలును పరిశీలించే బాధ్యత ఈ కమిటీకి ఉంటుంది.

**సహకార బ్యాంకుల అవకతవలపై ప్రత్యేక కమిటీ**

అసెంబ్లీలో జరిగిన చర్చల అనంతరం సహకార బ్యాంకుల అవకతవకలపై ప్రత్యేక కమిటీను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కమిటీ వివిధ సహకార బ్యాంకుల్లో జరిగిన అక్రమాలను వెలుగులోకి తేవడానికి ప్రత్యేకంగా ఏర్పాటైంది.

**అసెంబ్లీ సమావేశాల సమీక్ష**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. మొత్తం 15 రోజులపాటు జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో 85 గంటల 55 నిముషాల పాటు ప్రజా సమస్యలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో 113 ప్రశ్నలు, 2 స్వల్పకాలిక చర్చలు, 5 లఘు చర్చలు, ఒక ప్రభుత్వ తీర్మానం, 9 బిల్లులకు ఏకగ్రీవంగా ఆమోదం లభించింది.

**ప్రతిపక్ష వైఖరిపై స్పీకర్ స్పందన**

ప్రతిపక్ష సభ్యుల ప్రవర్తనపై అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కఠినమైన రూలింగ్ ఇచ్చారు. సభా మర్యాదలను గౌరవించాలని, నియమ నిబంధనలకు లోబడి వ్యవహరించాలని స్పష్టం చేశారు.

## ఎస్సీ వర్గీకరణ ఏకగ్రీవ తీర్మానంలో చంద్రబాబుదే కీలక పాత్ర: మందకృష్ణ

ఇచ్చారు. ఎస్సీ వర్గీకరణ కోసం చంద్రబాబు చిత్తశుద్ధితో కృషి చేశారు. చంద్రబాబు తల్లి ఆశీస్సులు తీసుకొని 1997లో పాదయాత్ర ప్రారంభించా. మోడీ, అమిత్ షా, వెంకయ్య, కిషన్ రెడ్డి.. మాకు అండగా నిలిచారు. మాదిగల ఉద్యమాన్ని గుర్తుచేస్తూ పవన్ కల్యాణ్ కూడా మద్దతు ఇచ్చారు. మా ఉద్యమంలో న్యాయం ఉందనేందుకు ఏకగ్రీవ తీర్మానాలే నిదర్శనం. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా చంద్రబాబు న్యాయం వైపే నిలబడ్డారు. ఇచ్చిన మాట కోసం ఆయన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**చంద్రబాబు చతురత వల్లే తీర్మానం**

జగన్ అధికారంలో ఉంటే గనక ఎస్సీ వర్గీకరణను ఇక చూసేవాళ్లం కాదు. కనీసం వినతిపత్రం ఇచ్చేందుకూ జగన్ మాకు అనుమతి ఇవ్వలేదు. ఎస్సీ వర్గీకరణపై తమ అభిప్రాయాన్ని వైసీపీ ఇంకా చెప్పలేదు. చంద్రబాబు చతురత వల్లే తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఎస్సీ వర్గీకరణ విషయంలో చంద్రబాబు సామాజిక న్యాయం చేశారు అని కొనియాడారు.

## పోసానికి ఊరట.. బెయిల్ మంజూరు

ఈలోపే పోసానికి కోర్టు బెయిల్ మంజూరు చేసింది.

**రేపు పోసాని విడుదలయ్యే అవకాశం**

ఇప్పుడు తాజాగా గుంటూరు సీఐడీ కోర్టు పోసానికి బెయిల్ మంజూరు చేసింది. అయితే రాష్ట్రంలో పోసానిపై ఇంకా అనేక చోట్ల కేసులు నమోదు అయిన నేపథ్యంలో ఏ జిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో పోసానిని మరోసారి అదుపులోకి తీసుకుంటారా లేక బెయిల్‌పై విడుదల అవుతారా అనేది దానిపై ఉత్కంఠ నెలకొంది. రేపు ఉదయం పోసాని విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో పోసానిపై రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. ఇప్పటి వరకు వైసీపీ నేత మూడు సార్లు అరెస్ట్ అయి రిమాండ్ విధించగా.. మూడు సార్లు కూడా ఆయనకు బెయిల్ లభించింది.



## తిరుమల అన్నప్రసాద వితరణకు నారా కుటుంబం

# రూ.44 లక్షల విరాళం

### అన్నప్రసాదాలు వడ్డించిన ముఖ్యమంత్రి, కుటుంబసభ్యులు



అమరావతి మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

తిరుమల శ్రీవారి దర్శనానంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కుటుంబ సభ్యులతో కలిసి స్వయంగా భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. ఈ సందర్భంగా భక్తులతో మాట్లాడుతూ టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. సౌకర్యాలు అద్భుతంగా ఉన్నాయని భక్తులు ముఖ్యమంత్రివర్యులు వద్ద సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం భక్తులతో కలిసి ఆయన భోజనం చేశారు. తమ మనువడు నారా దేవాన్ష్ 11వ పుట్టినరోజు సందర్భంగా తిరుమలలో ఒక్కరోజు అన్న ప్రసాదానికి అయ్యే రూ.44లక్షల ఖర్చును ఆన్‌లైన్ ద్వారా విరాళంగా అందించారు.







# హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ పోటీలు..

## ప్రభుత్వ ఖర్చు రూ. 27 కోట్లు

**మే 7వ తేదీ నుంచి 24 రోజులపాటు పోటీలు - గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ఆరంభ వేడుకలు**

**మే 31న హైటెక్స్‌లో మిస్ వరల్డ్ ఫైనల్స్**



హైదరాబాద్ మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

హైదరాబాద్‌లో మే 7 నుంచి 24 రోజులపాటు జరగనున్న మిస్ వరల్డ్ పోటీలకు ప్రభుత్వం రూ. 27 కోట్లు ఖర్చు చేయనుంది. గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో ప్రారంభ వేడుకలు జరగనుండగా, మే 31న హైటెక్స్‌లో మిస్ వరల్డ్ ఫైనల్స్ నిర్వహిస్తారు. ఈ పోటీల్లో మొత్తం 140 దేశాల నుంచి అందగత్తెలు పాల్గొంటారు. ఈ పోటీలకు మొత్తంగా రూ. 54 కోట్లు ఖర్చు కానుండగా, ప్రభుత్వ శాఖలు తమ వాటాగా రూ. 27 కోట్లు ఖర్చు చేయనున్నాయి. మిగతా రూ. 27 కోట్లను మిస్ వరల్డ్ సంస్థ ఖర్చు చేస్తుంది. ప్రభుత్వ వాటాగా ఉన్న రూ. 27 కోట్లను స్పాన్సర్ల ద్వారా సమీకరిస్తారు. మిస్ వరల్డ్ పోటీలకు సంబంధించిన వివరాలను పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈవో జూలియా మోర్లే మీడియాకు వెల్లడించారు. తెలంగాణలో మిస్ వరల్డ్ పోటీలు నిర్వహించడం ద్వారా రాష్ట్రంలో ఉపాధి, పెట్టుబడి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు తీసుకొచ్చేందుకు 72వ మిస్ వరల్డ్ పోటీలు తోడ్పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ లిమిటెడ్ సీఈఓ జూలియా మోర్లే మాట్లాడుతూ ఈ పోటీలు అందం కంటే అంతర్జాతీయ సంస్కృతి, సాధికారతకు ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. మిస్ వరల్డ్– 2024 క్రిస్టినా మాట్లాడుతూ.. గతేడాది తాను ఇక్కడే మిస్ వరల్డ్ కిరీటం అందుకున్నట్టు చెప్పారు. తన హృదయంలో ఇండియాకు ప్రత్యేక స్థానం ఉందని పేర్కొన్నారు. చీర కట్టుకోవడం తనకు సంతోషాన్ని ఇచ్చిందని వివరించారు. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా పోటీలు నిర్వహిస్తామని పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## హనీట్రాప్ వ్యవహారంపై

# అట్టుడికిన అసెంబ్లీ

### సీడీలు ప్రదర్శించిన బీజేపీ ఎమ్మెల్యేలు



న్యూఢిల్లీ మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

**కర్ణాటక అసెంబ్లీలో హనీట్రాప్ వ్యవహారంపై రగడ కొనసాగుతోంది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య పసంగిస్తున్న సమయంలో బీజేపీ ఎమ్మెల్యేలు సభలో ఆందోళన చేపట్టారు. అసెంబ్లీలో సీడీలను ప్రదర్శించారు. నేతల హనీట్రాప్ వెనుక ఉన్నది ఎవరో తేల్చాలని డిమాండ్ చేశారు. మంత్రులే తమపై హనీట్రాప్ జరిగిందని ఆరోపిస్తున్నారని నినాదాలు చేశారు. నిజనిజాలు ప్రజలకు తెలియని పట్టుబట్టారు.**

మంత్రులు రాజన్న , సతీష్ జర్కిహోలి తమపై హనీట్రాప్ కుట్ర జరిగిందని అసెంబ్లీలో గురువా రం(మార్చి 20) ప్రస్తావించారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు చేయాలని బీజేపీ డిమాండ్ చేసింది. మరోవైపు కాంట్రాక్ట్‌ల్లో ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ సభలో బీజేపీ ఎమ్మెల్యేలు తమ ఆందోళనను కొనసాగించారు. బిల్లు ప్రతులను అసెంబ్లీలో చింపేశారు. దీంతో పరిస్థితిని అదుపు చేయడానికి స్పీకర్ మార్షల్స్‌ను రప్పించారు. విపక్షాల నిరసనల మధ్యే ఈ బిల్లును అసెంబ్లీ ఆమోదించింది. అయితే బీజేపీ ఎమ్మెల్యేల తీరుపై సీఎం సిద్దరామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హనీట్రాప్ బాధితుల్లో అన్ని పార్టీల నేతలు ఉన్నారని, ఈ వ్యవహారంపై ఉన్నతస్థాయి కమిటీతో దర్యాప్తు చేస్తామని హామీ ఇచ్చినప్పటికి సభలో ఆందోళన చేయడం దారుణమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపిస్తా మన్నారు ముఖ్యమంత్రి.



శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ బాబు కుటుంబ సభ్యులు. నారా దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా దైవ దర్శనం చేసుకోవడం జరిగింది. ప్రత్యేక దృశ్యాలు.....


















డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com
శనివారం 22 మార్చి 2025



# ఎస్సీ వర్గీకరణపై శాసనసభ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ మాల మహానాడు ధర్నా

ఐ.పోలవరం మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

: ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ ఆంధ్రప్రదేశ్ శాసనసభ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో ఐ. పోలవరం తాసిల్దార్ కార్యాలయం వద్ద మహా ధర్నా నిర్వహించారు. శుక్రవారం ఐ.పోలవరం మెయిన్ రోడ్డు నుండి తాసిల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి మాల మహానాడు నాయకులు కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మాలలు పంతం చంద్రబాబు అంతం, మాలల ఐక్యత వర్ధిల్లాలి అంటూ మాల మహానాడు నాయకులు కార్యకర్తలు నినాదాలు చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 ను అతిక్రమించి రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలను వర్గీకరించడానికి లేదని నాయకులు నాయకులు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ పై తప్పుడు నివేదికలిచ్చి వర్గీకరణను మనువాద పార్టీలు ఏకమై మద్దతు తెలపడం దారుణం అన్నారు. భవిష్యత్తులో టిడిపి ప్రజా ప్రతినిధులు,నాయకులు తమ పదవులకు రాజీనామా చేసి బయటికి రావాలని, లేనిపక్షంలో వారు పేరు చివరలో మాదిగని పెట్టుకోవాలని పలువురు మాల మహానాడు కార్యకర్తలు డిమాండ్ చేశారు. అనంతరం ఐ. పోలవరం తాసిల్దార్ కు వాళ్ల డిమాండ్స్ తో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి నాయకత్వం వహించిన మాల మహానాడు నాయకులు రేవు శ్రీను, దుక్కుపాటి సత్యనారాయణ, ములపర్తి శ్రీనుబాబు, మట్ట గగనవీరుడు, వడ్డీ గౌతమ్, కాశీ పరివాజ్ కుమార్, ములపర్తి శ్రీరాములు , కమిడి గంగాధర్, పండు చందర్రావు, రేవు సత్యనారాయణ, ఉండ్రు శివరాజు, గుత్తాల ప్రసాద్, సాధనాల బాబూరావు, నాగా బత్తుల రామకృష్ణ, సోషల్ వర్కర్ కుంచే చినబాబు,మోర్త వెంకటేష్, గొల్లపల్లి వెంకట్రావు, రేవు సత్యనారాయణ ( అబ్బు ), మోకా కృష్ణమూర్తి తో పాటు అధిక సంఖ్యలో మాల మహానాడు కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన...



అల్లవరం, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

జిల్లా పంచాయతీ అధికారి అదేశాలను అనుసరించి అల్లవరం మండలం కొమరగిరి పట్నం లోకల్ ట్రైనింగ్ సెంటర్ %ూఎజూఎ% షెడ్ వద్ద అల్లవరం, అమలాపురం, మామిడికుదురు, మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, మరియు క్లాప్ మిత్రాలకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు, తడి చెత్త పొడి చెత్త వేరు చేయుట, నాడెపు తొట్టెలలో సెమీ కంపోస్ట్ తయారి విధానం, వెర్మీ తొట్టెలలో వెర్మీ కంపోస్ట్ తయారీ విధానంపై డివిజనల్ పంచాయతీ అధికారి పి. బొజ్జిరాజు ఆధ్వర్యంలో శుక్రవారం అల్లవరం విస్తరణ అధికారి యూ. నాగేంద్ర మరియు ఎఫ్.టి.సి మధు మహేష్ శిక్షణ ఇచ్చిరు, ఈ శిక్షణలో గ్రామ సర్పచ్ రాకాపు విజయలక్ష్మి, మామిడికుదురు,అమలాపురం మండలాల విస్తరణ అధికారులు కూడా పాల్గొన్నారు.

# ఓడలరేవు గ్రామస్తులు నీరసనకు మద్దతుగా జనసేన సంఘీభావం...



అల్లవరం, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఓడలరేవు ఓఎన్జీసి టెర్మినల్ ఎదుట ఓడలరేవు గ్రామస్తులు చేపట్టిన ఆందోళన శుక్రవారం 19వ రోజు కొనసాగింది. ఓఎన్జీసి తమ గ్రామాన్ని దత్తత తీసుకొని స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలంటూ గ్రామస్తులు భారీ నినాదాలతో హోరెత్తించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం ఒడలరేవు ఓఎన్జీసి టెర్మినల్ వద్ద ఎదుట ఓడలరేవు గ్రామస్తులు నిరసనకు మద్దతుగా మండల జనసేన నాయకులు గునిశెట్టి చిట్టిబాబు, రొక్కాల నాగేశ్వరావు, కంకిపాటి గోపి, తిక్క శేషుబాబు, గుర్రం కృష్ణ, నల్లా రాము, చాట్ల మంగతాయరు, కమల, సాధనలా సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. ఓఎన్జీసి అధికారులు ఓడలరేవు గ్రామస్తులతో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించాలని జనసేన నాయకులు కోరారు. గ్రామస్తులు నిరసన మద్దతుగా జనసేన పార్టీ సమస్య పరిష్కారం అయ్యేవరకు మద్దతు నిలుస్తుందని జనసేన నాయకులు తెలిపారు.

# అమ్మవారిని దర్శించుకున్న రాష్ట్ర కార్యదర్శి నాగిడి

కాట్రేనికోన, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



కాట్రేనికోన మండలం మొల్లేటి మొగ కొత్తపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కనక మహాలక్ష్మి అమ్మవారి తీర్థ మహోత్సవములు ఈనెల 16వ తేదీ నుండి 20వ తేదీ వరకు ఘనంగా నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. భారీగా బాణసంచా కాల్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే తీర్థ మహోత్సవాలు అనంతరం భారీ అన్న సమారాధన నిర్వహించినట్లు వారు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి, మాజీ మత్స్య శాఖ కార్పొరేషన్ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట వైదాడి పాండురంగారావు బలుసుతిప్ప టిడిపి నాయకులు సంగాని వెంకటేశ్వర్లు,పలువురు గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# ఉపాధి హామీ పథకం అమల్లో కోనసీమ ఫస్ట్

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ - ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్

అమలాపురం, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)




ఉభయ తారకమైన ప్రయోజనాలే లక్ష్యంగా పల్లెకు ఊపిరి పోసిన పథకంగా విరాజిల్లుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (నరేగా) పథకం అమలులో రాష్ట్రంలోనే అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచిందని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 57 లక్షల పనిదినాలకు గాను 56 లక్షల పని దినాల కల్పన ద్వారా ఈ ఘనత సాధించినట్లు వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ లు అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో చిన్న, సన్నకారు రైతులకు చెందిన లక్ష ఎకరాల్లో పండ్ల తోటలు పెంచడానికి ప్రణాళికలు సిద్ధం, పంట సేద్యపు నీటి కుంటల నిర్మాణం, కొండపల్లి హస్త కళాకారులకు ముడి సరుకు లభ్యత, ఏటి కొప్పాక హస్త కళాకారులకు కావలసిన ముడి సరుకు లభ్యత, బొబ్బిలి వీణల తయారీకి పనస మొక్కలు పెంచడానికి చర్యలు వంటి అంశాలతో పాటు పల్లె పండగ పనులైన గోకులాలు, సిసి రోడ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రోజువారి సగటు వేతనాన్ని రూ.291.21 చెల్లిస్తూ జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా వ్యాప్తంగా పల్లె పండగలో 896 గోకులాలు మంజూరు చేయగా వీటిలో 720 గోకులాలు నిర్మాణాలు పూర్తయ్యాయని మిగిలినవి పురోగతిలో ఉన్నాయని వీటిని ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా జిల్లావ్యాప్తంగా 118 కిలోమీటర్ల మేర సిసి రోడ్లు మంజూరు చేయగా వీటిలో 84 కిలోమీటర్లు అంతర్గత సీసీ రోడ్లు నిర్మాణం పూర్తయిందని మిగిలిన వాటిని ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయటంతో పాటు కూలీల రోజువారీ వేతనాన్ని రూ.300 వరకు ఇచ్చేందుకు పాటుపడాలన్నారు. ఈ విభాగం బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట వేయటంతోపాటు, పని వేళల్లో మార్పులు చేస్తూ కూలీలకు గిట్టుబాటు వేతనం అందించాలని సూచించారు. ఎండాకాలం నేపథ్యంలో పని క్షేత్రాలలో నీడ కోసం షెడ్లు ఏర్పాటు చేయాలని సురక్షిత త్రాగునీటిని సరఫరా చేయడంతో పాటు ఆరోగ్య సురక్ష సేవలైన ప్రాథమిక చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. వేతన మోనిటరింగ్ కమిటీతో పాటుగా మూడు అంచెల తనిఖీ వ్యవస్థను ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ఉద్యోగులు అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో బహుళ ప్రయోజనాలు చేకూరే విధంగా నరేగా అనుసంధానంతో వేతన కాంపోనెంట్, మెటీరియల్ కాంపోనెంట్ పనులు ప్రతిపాదిస్తూ గ్రామాల సర్వతో ముఖాభివృద్ధికి పాటుపడాలన్నారు. సేద్యపు నీటి కుంటల ద్వారా నీటి ఎద్దడి తగ్గటంతో పాటు, భూగర్భ జలాలు బాగా పెరుగుతాయని, నీటి కుంటల్లో చేపలను పెంచటం వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని అన్నారు. వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టి సాగునీటి ఎద్దడి నివారణ కోసం చేపట్టిన సేద్యపు కుంటలు రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. వ్యవసాయ అవసరాలకు ఈ కుంటలను వినియోగించుకుంటూనే వీటిలో చేపల పెంపకం ద్వారా అదనపు అదాయాన్ని సమకూర్చుకునేలా సాగు విధానంలో వినూత్న ఒరవడికి శ్రీకారం చుట్టారన్నారు. పంట కుంటల ద్వారా అదనపు అదాయాన్ని పొందుతున్న రైతులను చూసిన ఇతర రైతులు సైతం తమ పొలాల్లో పంట కుంటలు తవ్వుకునేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. నీటి కుంటల్లో చేపలు పెంచటం వల్ల, ఆ నీటిని పంట పొలాలకు అందించటం ద్వారా పంట దిగుబడులు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ విధానం వల్ల భవిష్యత్తులో రైతులు పెట్టుబడి ఖర్చులు తగ్గించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో డ్వామా పిడి ఎస్. మధుసూదన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ సి.హెచ్.ఎన్.వి. కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# అమలాపురంలో ఆపరేషన్ గరుడా.....

## మెడికల్ షాపులపై విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మెరుపు దాడులు.

అమలాపురం, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

డా. బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆపరేషన్ గరుడా పేరుతో మెడికల్ షాపులపై శుక్రవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు మెరుపు దాడులు నిర్వహించారు.ఎన్ఫోర్స్మెంట్ అధికారిని స్నేహిత ఆధ్వర్యంలో అమలాపురం పట్టణంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ , మందుల షాపులలో తనిఖీలు చేశారు. రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడను చేపట్టినట్టు విజిలెన్స్ ఇన్స్పెక్టర్ మధు వెల్లడించారు. విజిలెన్స్ దాడుల నేపథ్యంలో మెడికల్ షాపులు పట్టణ మందుల షాపు నిర్వాహకులు మూసివేశారు. నిషేధిత డ్రగ్స్ అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు హెచ్చరించారు.



# ఆల్ ఇండియా పోలీస్ క్రీడా పోటీలలో సత్తాచాటిన కానిస్టేబుల్ యాంద్ర గౌతమ్...

## అభినందించిన జిల్లా ఎస్పీ బి కృష్ణారావు..

అమలాపురం, మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆల్ ఇండియా పోలీస్ క్రీడా పోటీలలో సత్తాచాటిన కానిస్టేబుల్ యాంద్ర గౌతమ్ ను శుక్రవారం జిల్లా ఎస్పీ బి కృష్ణారావు అభినందించారు.. 2025 మార్చి 7 నుండి 11 వరకు హర్యానా రాష్ట్రం మడగడ లో జరిగిన 73వ ఆల్ ఇండియా పోలీస్ క్రీడా పోటీలలో వాలీబాల్ క్లస్టర్ క్రీడా విభాగంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన పోలీస్ కానిస్టేబుల్ కాంస్య పథకం సాధించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ జిల్లాకు చెందిన 2018 వ బ్యాచ్ సివిల్ కానిస్టేబుల్ యాంద్ర గౌతమ్ ఈ సంవత్సరం జరిగిన ఆల్ ఇండియా క్రీడా పోటీలలో సేపక్ తక్ర క్రీడా విభాగంలో కాంస్య పథకం సాధించినట్లు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి కృష్ణారావు తెలియజేసారు. యాంద్ర గౌతమ్ సేపక్ తక్రా క్రీడలో బాగా రాణిస్తున్నట్లు, వరుసగా 2023 సం"లో పంజాబ్ రాష్ట్రంలో జలంధర్ లో, 2024 సం"లో మహారాష్ట్ర రాష్ట్రంలో నాగపూర్ లో జరిగిన ఆల్ ఇండియా పోలీస్ క్రీడలలో కాంస్య పతకాలు సాధించి వరుసగా మూడవసారి గౌతమ్ పథకం సాధించడం విశేషమని తెలిపారు

# సోషల్ మీడియా ద్వారా ప్రజలకు "సత్యా"లు తెలపాలి

## సత్యమోహన్ కు సూచించిన మాజీ ముఖ్యమంత్రి జగన్

అంబాజీపేట మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు సక్రమంగా అమలుకాకపోవటానికి తగిన కారణాలను ప్రజలకు సోషల్ మీడియా ద్వారా తెలపాలని మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి సూచించారు. ఈ మేరకు డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా సోషల్ మీడియా ఇంచార్జి గా నియమితులైన అంబాజీపేట మండలం మాచవరంకు చెందిన దొమ్మేటి సత్య మోహన్ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని గురువారం తాడేపల్లి వైఎస్ఆర్సిపి కేంద్ర కార్యాలయంలో కలిసి తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మంచిని జిల్లా వ్యాప్తంగా సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేసి ప్రజలను ముఖ్యంగా యువతను చైతన్య పర్చాలన్నారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న కక్ష పూరిత విధానాలు, ప్రజలకు అమలు చేస్తున్న పథకాల్లోని లోపాలను గుర్తించి ప్రజల దృష్టికి తీసుకొని వెళ్లాలని మోహన్ కు సూచించారు.ఇదిలావుండగా కోనసీమ జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడుగా నియమితులైన మోహన్ గతంలో సామాన్య కార్యకర్తగా,నియోజకవర్గ ఐటీ ఇన్చార్జిగా, అంబాజీపేట మండల జెసిఎస్ కన్వీనర్ గా,జిల్లా ప్రచార విభాగ అధ్యక్షులుగా,అంబాజీపేట సొసైటీ చైర్మన్ గా పలు బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించడంతో ఆ సేవలను గుర్తించి కోనసీమ జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జిగా నియమించినట్లు సత్య మోహన్ తెలిపారు. ఈ మేరకు జగన్ కలిసి తాను కృతజ్ఞతలు తెలిపానని సత్యమోహన్ పేర్కొన్నారు.



# ఎల్ఐసి ఏజెంట్ల ఆర్థిక భద్రతకు భరోసా కల్పించాలి



ఏలూరు మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఎల్ఐసి ఏజెంట్ల భద్రత, బీమా రంగ స్థిరత్వాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే కమీషన్ మార్పులను రద్దు చేస్తూ, ఏజెంట్ల ఆర్థిక భద్రతకు భరోసా కల్పించాలని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పార్లమెంట్ సమావేశాల సందర్భంగా లోక్ సభ స్పీకర్ ఓం బిర్లాకు శుక్రవారం నివేదిక సమర్పించారు. కోట్లాది మంది భారత ప్రజల భవిష్యత్ కు ఆర్థిక భద్రత కల్పిస్తున్న ఎల్ఐసి ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం చొరవ చూపాలని, లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉన్న 14.4 లక్షల మంది ఏజెంట్లు రూ.44.31 లక్షల కోట్ల లైఫ్ ఫండ్, రూ.52.85 లక్షల కోట్ల జీవిత బీమా సంస్థ ఆస్తులకు విశేషంగా సహకరిస్తున్నారని, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇటీవల తీసుకొచ్చిన మార్గదర్శకాల వల్ల ఎల్ఐసి ఏజెంట్ల జీవనోపాధిని ప్రశ్నార్థకంగా మార్చిందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కొత్త నిబంధనల ప్రకారం పాలసీదారులు తమ పాలసీలను రెండేళ్లకే సరెండర్ చేయడానికి ప్రోత్సహించే విధంగా ఉన్నాయని, దీని వల్ల దీర్ఘకాలిక బంధం దెబ్బతింటుందని, ఐఆర్డీఏఐ స్పష్టమైన కమీషన్ మార్గదర్శకాలను రూపొందించకుండా అధికారాలను బీమా కంపెనీలకు అప్పగించడం ద్వారా ఏర్పడే అసమానతల వల్ల ఏజెంట్ల ఆర్థిక భద్రత దెబ్బతింటోందని, కమిషన్ మార్చడం వల్ల మొదటి సంవత్సరపు ఆదాయం తగ్గి, చెల్లింపులు ఆరేళ్లకు పొడిగించడం ద్వారా ఏజెంట్లపై మరింత భారం పడుతుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వివరించారు. అంతే కాకుండా "క్లాబ్యాక్ ప్రొవిజన్" ద్వారా పాలసీదారులు ఐదేళ్ల లోపు పాలసీ సరెండర్ చేస్తే ఏజెంట్లు తమ కమిషన్ తిరిగి ఇవ్వాల్సి ఉంటుందని, ఈ నిబంధన కూడా అవరోధంగా మారడంతో జీవిత బీమా రంగం అస్థిరతకు దారి తీస్తుందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కొత్తగా తీసుకొచ్చిన మార్గదర్శకాల వల్ల పాలసీ కొనసాగింపు రేటు తగ్గిందని, 2010లో 4.4% ఉన్న ఈ రేటు 2023లో 3%కు పడిపోయిందని, ఏజెంట్ల తగ్గుదలతో బీమా రంగ స్థిరత్వం మరింత దెబ్బతింటోందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ తన నివేదికలో వివరించారు.

# ఈనెల 22వ తేదీన ప్రపంచ జల దినోత్సవం

ఏలూరు మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం ప్రపంచ జల దినోత్సవం పల్లెపండుగ కార్యక్రమం పై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి కె. పవన్ కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ లో నీటి ఎద్దడిని తట్టుకోవడానికి పంటనీటి కుంటలు నిర్మించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.55 లక్షల పంట నీటికుంటలు జూన్ నెల చివరిలోగా నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్లుతున్నామన్నారు. ప్రత్యేకంగా నిరుపేదలకు ఉపాధిహామీ పథకం ద్వారా పారదర్శకంగా పనులు కల్పించాలన్నారు. పండ్లతోటల సాగు విస్తీర్ణం ఏడాదిలో లక్ష ఎకరాలకు పెరగాలన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో నిర్దేశించిన మేరకు సిసి రోడ్లు, గోకులాలు నిర్మించాలని అధికారులకు సూచించారు. ఏలూరు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పాల్గొన్నారు. అనంతరం సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో 5 వేల పంటనీటి కుంటలు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్ధేశించిందన్నారు. ఇందులో ఇప్పటికే 2 వేల 389 పనులను మంజూరు చేయడం జరిగిందన్నారు. నిర్ధేశించిన పంట నీటికుంటల నిర్మాణాలను జూన్ చివరినాటికి పూర్తిచేసే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పంట నీటి కుంటల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయడానికి అధికారులు ప్రణాళిక బద్ధదంగా ముందుకు సాగాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 850 గోకుల షెడ్డులు మంజూరు కాగా ఇప్పటికే 623 పూర్తయి మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. పల్లె పండుగ కింద జిల్లాలో 162.33 కి.మీ. మేర సిసిరోడ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యాలను నిర్ధేశించిందన్నారు. పంచాయితీరాజ్ ద్వారా ఇంతవరకు 155.29 కిలోమీటర్ల మేర సిసి రోడ్ల నిర్మాణం పూర్తిచేశారన్నారు. కార్యక్రమంలో డ్వామా పిడి కె. వెంకట సుబ్బారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి షేక్ హాబీబ్ భాషా, జెడ్పి సిఇఓ కె. భీమేశ్వరరావు, డిపివో కె. అనురాధ, పంచాయితీరాజ్ ఎస్ఈ ఎంవి. రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల నమోదు...

### క్యాన్సర్ వ్యాధి బాధితులకు అండగా - మంత్రి సుభాష్ దాతృత్వం...

రామచంద్రపురం మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

క్యాన్సర్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరం భాగమవుదాం.. ప్రపంచాన్ని పీడిస్తున్న మహమ్మారిని తరిమికొడదాం క్యాన్సర్ బాధితులకు అండగా నిలబడదాం, అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. నేడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలోని కార్మిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని వారికి మెరుగైన వైద్య సహాయం కోసం,(గుంటూరు హాస్పిటల్ ద్వారా) అవసరమైన మందులు ఇవ్వాలనే ఉద్దేశ్యంతో రోగుల యొక్క వివరాలు నేడు అనగా శనివారం రోజున వైద్యుల సమక్షంలో సాయంత్రం నాలుగు గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయంలో క్యాన్సర్ రోగుల యొక్క వివరములు నమోదు చేయబడతాయని తెలియజేశారు. క్యాంపు కార్యాలయానికి రాలేని వారు, వారి బంధువులు లేదా వారి యొక్క సహాయకులు ద్వారా వ్యాధిగ్రస్తుల వివరాలు అందించవచ్చునని నీ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని తెలియజేశారు.



# మహిళలు, పిల్లల సంరక్షణకు మిషన్ శక్తి, మిషన్ వాత్సల్య అమలు.

## ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చిన కేంద్రమంత్రి.

ఏలూరు మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

మహిళా మరియు శిశు కౌన్సెలింగ్ కేంద్రాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు గత ఐదేళ్లలో కేటాయించిన నిధులు, ఏపీతో పాటు ఏలూరు జిల్లాలో పనిచేస్తున్న మహిళా మరియు శిశు కౌన్సెలింగ్ కేంద్రాల సంఖ్య, మహిళా మరియు శిశు మానసిక నిపుణులు, థెరపిస్ట్‌లు మరియు సైకియాట్రిస్ట్‌ల పోస్టుల సంఖ్య, కౌన్సెలింగ్ కేంద్రాలలో ఖాళీల వివరాలపై పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ లోక్ సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి సావిత్రి ఠాకూర్ శుక్రవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. హింసకు గురై కష్టాల్లో ఉన్న మహిళలకు వన్ స్టాప్ సెంటర్లు అండగా నిలిచి సహాయాన్ని అందిస్తాయని, నిరుపేద మహిళలకు వైద్య సహాయం, న్యాయ సహాయం, తాత్కాలిక ఆశ్రయం, పోలీసు సహాయం, మానసిక సామాజిక కౌన్సెలింగ్ వంటి సేవలు అందుతాయని, నేరాల రేటు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఒకటి, అవసరమైతే అదనంగా మరొక ఓ.ఎస్.సి ఏర్పాటు చేస్తారని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 894 ఓ.ఎస్.సిలకు గాను, ఆంధ్రప్రదేశ్లో 26, ఏలూరు జిల్లాలో ఒకటి చొప్పున ఉన్నాయని, గత ఐదేళ్లలో వన్ స్టాప్ సెంటర్ల కోసం రూ.13.94 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రమంత్రి తెలిపారు. కేంద్ర మంత్రిత్వ శాఖ 'మిషన్ వాత్సల్య' పేరిట కేంద్ర ప్రాయోజిత పథకాన్ని అమలు చేస్తోందని, సంరక్షణ సేవలు, నాన్-ఇన్‌స్టిట్యూషనల్ కేర్ సేవలు రెండింటినీ కలిగి ఉంటుందని, పునరావాస చర్యగా పిల్లల సంరక్షణ సంస్థల ద్వారా సంస్థాగత సంరక్షణ అందించబడుతుందని, వయస్సుకు తగిన విద్య, వృత్తిపరమైన శిక్షణ, వినోదం, ఆరోగ్య సంరక్షణ, కౌన్సెలింగ్ మొదలైన వాటికి జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, చైల్డ్ కేర్ ఇన్‌స్టిట్యూషన్‌లో కౌన్సిలింగ్ సదుపాయం ఉంటుందని కేంద్ర మంత్రి బదులిచ్చారు. బెంగుళూరు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ %d% న్యూరోసైన్సెస్ సహకారంతో మహిళా మరియు శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, బాలల రక్షణ, మానసిక ఆరోగ్యం, మానసిక సంరక్షణ, ఇతర మానసిక సామర్థ్యాలను పెంపొందించే శిక్షణ అందిస్తున్నట్లు కేంద్రమంత్రి వెల్లడించారు. మిషన్ శక్తి మార్గదర్శకాల ప్రకారం ప్రతి ఓ.ఎస్.సి వద్ద ఒక సైకో సోషల్ కౌన్సెలర్‌తో సహా 13 మంది మానవశక్తి వనరుల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 100 శాతం ఆర్థిక సహాయాన్ని అందిస్తుందని, మహిళలు మరియు పిల్లల సంబంధిత పథకాల అమలు కోసం మంత్రిత్వ శాఖ 'మిషన్ శక్తి' మరియు 'మిషన్ వాత్సల్య' మార్గదర్శకాలను విడుదల చేసిందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.





# దేశ శాంతి భద్రతలో సిఐఎస్ఎఫ్‌దే ప్రముఖ పాత్ర

మచిలీపట్నం మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



దేశ శాంతి భద్రతలో కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం (సిఐఎస్ఎఫ్) ప్రముఖ పాత్ర పోషిస్తుందని, వారు సురక్షిత తీరం-సమృద్ధి భారత్ లక్ష్యంగా చేపట్టిన సైకిల్ ర్యాలీ అభినందనీయం - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ . శుక్రవారం ఉదయం నగరంలోని జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్ ప్రాంగణంలో (సిఐఎస్ఎఫ్) సముద్ర తీర సైకిల్ ర్యాలీని జిల్లా కలెక్టర్ అదనపు పోలీసు అధికారి సత్యనారాయణ తో కలిసి జండా ఊపి ప్రారంభించారు. అంతకుమునుపు ర్యాలీలో పాల్గొన్న సిఐఎస్ఎఫ్ సిబ్బందిని జిల్లా కలెక్టర్ అభినందిస్తూ వారు చూపుతున్న దేశభక్తి, అంకితభావం ప్రశంసనీయమన్నారు. తదుపరి వారితో కలిసి ఫోటో దిగారు. ఈ ర్యాలీ చీరాల,ఒంగోలు, కావలి, నాయుడుపేట సముద్ర తీర ప్రాంతాల మీదుగా తమిళనాడులోని కన్యాకుమారికి చేరుకోనుంది. సైకిల్ ర్యాలీలో 50 మంది సిఐఎస్ఎఫ్ సిబ్బందితో కలసి జిల్లా కలెక్టర్, అదనపు ఎస్పి నగరంలో మూడు స్తంభాల సెంటర్ వరకు సైకిల్ తొక్కుతూ వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ సిఐఎస్ఎఫ్ దేశం నలుమూలల అంతర్గత పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తుందన్నారు.దేశంలో అత్యున్నత ప్రమాణాలతో భద్రతను అందిస్తున్న పారా మిలటరీ దళం సిఐఎస్ఎఫ్ అని కొనియాడారు. సముద్ర తీర ప్రాంత ప్రజలలో దేశభద్రత, సమైక్యతను పెంపొందించి దేశ, రాష్ట్ర, జిల్లా ప్రజలను సిఐఎస్ఎఫ్ సిబ్బందితో మమేకం చేస్తూ ర్యాలీ చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ ర్యాలీ కోల్కతా నుండి మొదలై తమిళనాడులోని కన్యాకుమారి వరకు సముద్ర తీర ప్రాంతాల్లో సాగుతుందన్నారు. దేశంలో మహోన్నత లక్ష్యంతో సిఐఎస్ఎఫ్ 6 వేల కిలోమీటర్ల సైకిల్ ర్యాలీ చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా సైకిల్ ర్యాలీ కృష్ణాజిల్లా మచిలీపట్నం చేరుకుందన్నారు. జిల్లాలో 111 కిలోమీటర్ల మేరకు సైకిల్ తొక్కుతూ చీరాలకు చేరుకుంటారన్నారు. సముద్రతీరం సురక్షితంగా ఉంటే దేశం కూడా భద్రంగా ఉంటుందన్నారు. సముద్రతీరాన్ని రక్షించడం సిఐఎస్ఎఫ్ ఒకరిదే బాధ్యత కాదని, ప్రజలందరి బాధ్యత కూడా ఉందన్నారు. సముద్రతీరంలో ఏమైనా చిన్న చిన్న సంఘటనలు జరిగినప్పుడు, ఇతర ఇంటిలిజెంట్ సమాచారం ఎప్పటికప్పుడు ప్రజలు భద్రత సిబ్బందికి తెలియజేయడం వలన రాబోయే ముప్పును అరికట్టవచ్చన్నారు. ప్రజల సహకారంతోనే ప్రభుత్వం ముందడుగు వేయడానికి వీలుందన్నారు. ప్రజలను భాగస్వామ్యులుగా చేయాలనే ఉద్దేశంతో సిఐఎస్ ఎఫ్ బృహత్తర కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ ర్యాలీ ప్రజల్లో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు ఈ కార్యక్రమంలో సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్లు వినీత్ కుమార్ ప్రభాకర్, హృషబ్ దేవాంగన్, అసిస్టెంట్ కమాండెంట్ అరవింద్ శర్మ పలువురు సిఐఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

# బందరు అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలి : మంత్రి కొల్లు రవీంద్ర

ఏలూరు మార్చి 21 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



బందరు అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు సహకారం అందించాలని గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలను కోరారు. బందరు స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మచిలీపట్నం నగర పరిధిలోని పాత రైల్వే స్టేషన్ నుంచి బందరుకోటకి వెళ్లే రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటే కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, ఇతర కూటమి నాయకులతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నగరంలో మచిలీపట్నం పోర్టు రోడ్డుకు ఎంతో ప్రత్యేకత ఉందని, గతంలో పోర్టుకు వెళ్లేందుకు ఈ రహదారిని ప్రధానంగా ఉపయోగించడం వల్ల పోర్టు రోడ్డుగా ప్రసిద్ధి చెందిందని నాటి సంగతులను మంత్రి గుర్తు చేశారు. తర్వాతి క్రమంలో రహదారి పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైందని, కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్వచ్ఛ బందరు కార్యక్రమంతో మొత్తం శుభ్రం చేశామన్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును మరింత సుందరీకరణగా తీర్చిదిద్దే క్రమంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటి పచ్చదనంతో ఆహ్లాదకరంగా మార్చేందుకు నేటి కార్యక్రమంతో శ్రీకారం చుట్టామన్నారు. ప్రభుత్వం, కూటమి నాయకుల సహకారంతో నగరం మొత్తాన్ని ఇదే రీతిలో పచ్చదనంగా మార్చేందుకు, రహదారులను సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. ఈ ప్రణాళికలో భాగంగా నగరంలో రహదారులకిరువైపులా ఉన్న ఆక్రమణలను ఇప్పటికే తొలగిస్తూ వస్తున్నామని, అయితే చేస్తున్న ఈ పనిని అతి తక్కువ మంది వ్యతిరేకిస్తున్నప్పటికీ అధిక మొత్తంలో ప్రజలందరూ హర్షిస్తున్నారన్నారు. ఈ బృహత్తర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, తమ సలహాలు, సూచనలతో బందరు అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. విజన్ 2047, పీ4 కార్యక్రమాలు పేదరికం లేని సమాజ నిర్మాణం, పరిశుభ్రత, సుందరీకరణ, పట్టణ గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలన్నారు. నగరంలోని రహదారులపై పశువుల సంచారంతో ప్రమాదాలకు ముప్పుగా మారిందని, దీనిని అధిగమించేందుకు మంగినపూడి బీచ్ ప్రాంతంలో 15 ఎకరాలు కేటాయించి, పట్టించుకోని పశువులను అక్కడకు తరలించడం జరుగుతుందన్నారు. జిల్లా పరిధిలోని ముడా ఏరియాని సి ఆర్ డి ఏ రాజధాని పరిధిలోకి తీసుకువచ్చే విధంగా జిల్లాలోని ముఖ్య నాయకులతో త్వరలో ముఖ్యమంత్రిని కలిసి అభ్యర్థిస్తామన్నారు. ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు మాట్లాడుతూ పచ్చదనం, పరిశుభ్రత రెండూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలని, ఆ స్ఫూర్తితో మచిలీపట్నం నగరాన్ని పచ్చదనంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు ఎంతో సహకారాన్ని అందిస్తున్నారన్నారని, వారి సహకారంతోనే పట్టణ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, కూటమి నాయకులు బండి రామకృష్ణ, కుంచె నాని, తలారి సోమశేఖర్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, జిల్లా ప్రజా రవాణా అధికారి వాణీశ్రీ, మచిలీపట్నం డిపో మేనేజర్ పెద్దిరాజులు, నగర మున్సిపల్ కమిషనర్ బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

https://epaper.teluguraastram.com

తెలుగురాష్ట్రం దినపత్రిక

# రష్యాలోని ఉక్రెయిన్ పౌరులకు
# పుతిన్ అల్టిమేటం

ఉక్రెయిన్ : రష్యాలో నివసిస్తున్న ఉక్రెయిన్ పౌరులకు ఆ దేశాధ్యక్షుడు పుతిన్ అల్టిమేటం జారీ చేసినట్లు తెలుస్తోంది. వారంతా ఇమిగ్రేషన్ స్టేటస్‌ను చట్టబద్ధం చేసుకోవాలని, లేనిపక్షంలో దేశాన్ని వీడాలని ఆయన ఆదేశించినట్లు సమాచారం. ఈమేరకు పలు అంతర్జాతీయ మీడియాల్లో కథనాలు వెలువడ్డాయి. 2022లో రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఉక్రెయిన్‌లో భాగమైన దొనేత్స్క్, లుహాన్స్క్, ఖేర్సన్, జపోరిజియా ప్రాంతాలను రష్యా స్వాధీనం చేసుకుంది. తాజాగా ఆ ప్రాంతాల్లోని నివాసితులు రష్యాలో ఉండాలంటే దేశ పౌరసత్వం తప్పనిసరిగా తీసుకోవాలని పుతిన్ ఆదేశాలు జారీ చేశారు. లేకుంటే సెప్టెంబరు 10 కల్లా దేశాన్ని వీడాలని ఆయన హెచ్చరించారు. ఈ తాజా ఉత్తర్వులు 2014లో మాస్కో సొంతం చేసుకున్న క్రిమియా ప్రాంతాల్లోని నివాసితులకు సైతం వర్తిస్తుందని ఆయన తెలిపారు. ఇక, ఇటీవల కాలంలో పుతిన్



ప్రభుత్వం ఉక్రెయిన్ పౌరులపై ఇలాంటి ఒత్తిడి తెస్తూనే ఉంది. గతేడాది ఆయా ప్రాంతాల్లోని పౌరులకు రష్యన్ పాస్‌పోర్టులు జారీ చేసే ప్రక్రియను చేపట్టారు. ఈ చర్యలను ఉక్రెయిన్‌తో సహా దాని మిత్ర దేశాలు అప్పుడే ఖండించాయి. ఈక్రమంలో మరోసారి ఇలాంటి ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందులోభాగంగా 30 రోజుల కాల్పుల విరమణను ప్రతిపాదించారు. అందుకు కీవ్ అంగీకరించగా.. మాస్కో సూత్రప్రాయంగా ఒప్పుకుంది. ఇటీవల పుతిన్‌తో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్‌లోని ఇంధన, మౌలిక సదుపాయాలపై నెల రోజుల పాటు దాడులు నిలిపివేయాలని ఈ చర్చల్లో నిర్ణయించుకున్నారు. అయితే, ఒప్పందం కుదుర్చుకున్న కొన్ని గంటలకే అది ఉల్లంఘనకు గురైంది. ఈ దాడులు, ప్రతిదాడులు జరుగుతున్న సమయంలోనే రెండు దేశాలు 175 మంది యుద్ధ ఖైదీలను మార్పిడి చేసుకోవడం గమనార్హం. బుధవారం జెలెన్‌స్కీ, ట్రంప్‌లు ఫోన్‌లో మాట్లాడారు. దాదాపు గంటపాటు జరిగిన ఈ సంభాషణలో పుతిన్‌తో జరిపిన చర్చల పైనే ఎక్కువసేపు మాట్లాడుకున్నారు. ఇదిలాఉండగా.. ఆదివారం సౌదీ అరేబియాలోని జెడ్డాలో కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు ప్రారంభం కానున్నట్లు యూఎస్ అధికారి తెలిపారు.

# ఆ భారతీయ విద్యార్థిని
# బహిష్కరించొద్దు..

### అమెరికా న్యాయస్థానం ఉత్తర్వులు



**వాషింగ్టన్: హమాస్ భావజాలాన్ని వ్యాప్తి చేస్తున్నారన్న ఆరోపణలతో భారత విద్యార్థి బదర్ ఖాన్ సురి అమెరికాలో అరెస్టయిన సంగతి తెలిసిందే. అతడిని దేశం నుంచి బహిష్కరించేందుకు అగ్రరాజ్యం చేసిన ప్రయత్నాలను యూఎస్ కోర్టు నిలువరించింది. తాము తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు అతడి బహిష్కరణకు వీల్లేదని వర్జీనియా కోర్టు తీర్పు వెలువరించింది.**

వాషింగ్టన్ డీసీలోని జార్జ్‌టౌన్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్‌గా ఉన్న బదర్ ఖాన్ సురి .. విశ్వవిద్యాలయంలో హమాస్‌కు మద్దతుగా ప్రచారం చేస్తున్నాడని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ అధికారులు ఆరోపించారు. ఆ ఉగ్రవాద సంస్థలోని పలువురితో అతడికి సన్నిహిత సంబంధాలున్నాయని పేర్కొన్నారు. దీంతో అతడి వీసాను రద్దు చేయడమే గాక.. గత సోమవారం వర్జీనియాలోని నివాసం నుంచి అతడిని అదుపులోకి తీసుకున్నారు.

దీంతో తన అరెస్టును సవాల్ చేస్తూ సురి కోర్టును ఆశ్రయించారు. ఇది పూర్తిగా రాజకీయ కుట్రపూరిత చర్యేనని తన పిటిషన్‌లో ఆరోపించారు. దీనిపై విచారణ జరిపిన ఈస్టర్న్ డిస్ట్రిక్ట్ ఆఫ్ వర్జీనియా కోర్టు.. అతడికి తాత్కాలిక ఉపశమనం కల్పించింది. ఈ వ్యవహారంపై న్యాయస్థానం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకు అతడిని అమెరికా నుంచి పంపించకూడదని స్పష్టం చేసింది. ప్రస్తుతం సురిని లూసియానాలోని ఇమిగ్రేషన్ డిటెన్షన్ సెంటర్‌లో ఉంచినట్లు అమెరికన్ సివిల్ లిబర్టీస్ యూనియన్ వెల్లడించింది.

భారతీయుడైన బదర్ ఖాన్ సురి విద్యార్థి వీసాపై అమెరికా వచ్చాడు. దిల్లీలోని జామియా మిలియా ఇస్లామియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఆపై పోస్ట్ డాక్టోరల్ కోసం అమెరికా విశ్వవిద్యాలయంలో చేరాడు. అతడి భార్య మాఫెజ్ సలేహ్ పాలస్తీనా మూలాలున్న అమెరికా పౌరురాలు. సలేహ్ తండ్రి గతంలో గాజా ప్రభుత్వంలో పనిచేసినట్లు తెలుస్తోంది.

### స్వీయ బహిష్కరణకు సీబీపీ హోమ్ యాప్..

ఇదిలాఉండగా.. చట్టవ్యతిరేకంగా అమెరికాలో ఉంటున్నవారు దేశం నుంచి స్వీయ బహిష్కరణ చేసుకునేందుకు వీలుగా సీబీపీ హోమ్ యాప్‌ను రూపొందించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. అక్రమ వలసదారులు ఆ యాప్‌ను వినియోగించుకొని దేశాన్ని వీడాలని సూచించారు. లేకపోతే బలవంతంగా పంపిస్తామని, శాశ్వతంగా అమెరికాలో అడుగుపెట్టకుండా చేస్తామని హెచ్చరించారు. స్వచ్ఛందంగా వెళ్లిపోయినవారికి భవిష్యత్తులో చట్టబద్ధంగా మళ్లీ అమెరికాకు వచ్చే అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు.

అంతకుముందు భారత విద్యార్థి రంజనీ శ్రీనివాసన్ ఈ యాప్‌ను ఉపయోగించుకునే అమెరికాను వీడిన సంగతి తెలిసిందే. ఇటీవల కొలంబియా యూనివర్సిటీలోనూ పాలస్తీనాకు మద్దతుగా నిరసనలు జరిగాయి. వీటికి మద్దతు తెలిపిన రంజనీ వీసాను అగ్రరాజ్యం రద్దు చేయడంతో ఆమె స్వీయ బహిష్కరణ చేసుకుంది.

# టెస్లాపై దాడి చేస్తే 20 ఏళ్ల జైలు: ట్రంప్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తున్న సంపన్నుడు ఎలాన్ మస్క్ యాజమాన్యంలోని టెస్లా విద్యుత్ కార్ల సంస్థకు చెందిన ఆస్తులపై దాడులు పెరిగిపోతున్నాయి. ఈనేపథ్యంలో ట్రంప్ నుంచి స్పందన వచ్చింది. టెస్లా కార్లపై దాడికి పాల్పడేవారికి 20 సంవత్సరాలు జైలు శిక్ష పడేందుకు మంచి అవకాశం ఉందని వ్యంగ్యంగా పోస్టు పెట్టారు. ఈ దాడులను ప్రోత్సహిస్తోన్న వారికి కూడా శిక్ష తప్పదని హెచ్చరించారు.

అమెరికా, ఇతర దేశాల్లో టెస్లా షోరూమ్‌లు, విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లతోపాటు కార్ల పైనా ఇటీవల దాడులు చోటుచేసుకున్నాయి. భద్రత కరవైందన్న కారణంగా కెనడాలో అంతర్జాతీయ వాహన ప్రదర్శన నుంచి టెస్లా తన ఉత్పాదనలను ఉపసంహరించుకుంది. మస్క్‌ను ప్రభుత్వ సామర్థ్య పెంపుదల విభాగం (డోజ్) అధినేతగా ట్రంప్ నియమించినప్పటి నుంచీ టెస్లాపై దాడులు బాగా పెరిగిపోయాయి. ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించాలన్న మస్క్ సలహా మేరకు ట్రంప్ ప్రభుత్వం ఎందరో ప్రభుత్వోద్యోగులకు ఉద్వాసన పలకడంతోపాటు పలు వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. మస్క్ విధానాలను వ్యతిరేకిస్తున్నవారు ఉత్తర అమెరికా, యూరప్‌లలోని ఆయన కార్యాలయాలు, కర్మాగారాల ఎదుట ఆందోళనలు నిర్వహించారు. మస్క్‌తో విభేదిస్తున్న పలువురు సెనేటర్లు తమ టెస్లా కార్లను విక్రయించేస్తామని ప్రతినబూనారు.

మరోవైపు లాస్‌వెగాస్‌లో టెస్లా షోరూంలోని ఐదు కార్లకు దుండగులు నిప్పంటించారు. అనంతరం ఒక కారుపై అభ్యంతరకర పదజాలంతో స్ప్రే పెయింట్ వేశారు. టెస్లా ఉత్పత్తి చేసిన వాహనాలపై పేలుడు పదార్థాన్ని విసిరిన ఘటనకు సంబంధించి పోలీసులు గత నెలలో ఒక మహిళను అదుపులోకి తీసుకున్నారు. చార్లెస్టన్ సమీపంలో టెస్లా ఛార్జింగ్ స్టేషన్లను తగలబెట్టిన ఒక వ్యక్తిని సౌత్ కరోలినాలో అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. టెస్లాపై దాడులకు దిగేవారు నరకాన్ని అనుభవించబోతున్నారని ట్రంప్ హెచ్చరించారు. ఈక్రమంలోనే తన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్టు పెట్టారు.

ఇదిలాఉంటే.. ఇటీవల తన మిత్రుడు మస్క్‌కు మద్దతుగా నిలిచిన సంగతి తెలిసిందే. మాటిచ్చినట్టుగానే టెస్లా కారు కొనుగోలు చేశారు. అధ్యక్షుడి కోసం టెస్లా అధినేత ఏకంగా 5 కార్లను వైట్‌హౌస్‌కు తీసుకురావడం విశేషం. వీటి ఫీచర్లను తానే దగ్గరుండి వివరించారు. అందులోనుంచి ఎరుపురంగు కారును ట్రంప్ ఎంపిక చేసుకున్నారు. డ్రైవింగు సీట్లో అధ్యక్షుడు కూర్చోగా, ఆ పక్కనే ఉన్న మస్క్.."ఇది వేగంగా వెళ్లే కారు. సీక్రెట్ సర్వీసుకు ఓసారి షాక్ ఇద్దామా?" అని సరదాగా జోక్ చేశారు. అయితే, వాహనాన్ని నడిపేందుకు ట్రంప్‌నకు అనుమతి లేనందున ఆయన టెస్ట్ డ్రైవింగుకు వెళ్లలేదు.

# మా జోలికొస్తే అమెరికాకు
# గట్టి ఎదురు దెబ్బ తగులుతుంది: ఖమేనీ



**ఇరాన్ : యెమెన్‌లోని హూతీలపై అమెరికా భీకర స్థాయిలో విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. ఇటీవల ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హూతీ తిరుగుబాటుదారుల చర్యలకు ఇరాన్‌తో ముడిపెడుతూ..తదుపరి దాడులకు పాల్పడితే టెహ్రాన్ తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై తాజాగా ఇరాన్ సుప్రీం లీడర్ అయాతుల్లా అలీ ఖమేనీ స్పందించారు. యెమెన్‌కు చెందిన హూతీలు తాము చెప్తే దాడులకు పాల్పడట్లేదని..ఆ విషయంలో వారికి సొంత కారణాలు ఉన్నాయని పేర్కొన్నారు.**

తాము ఎప్పుడూ.. ఎవరితోనూ ఘర్షణలు ప్రారంభించలేదని.. అలా అని ఎవరైనా తమ జోలికి వస్తే మాత్రం ఊరుకోమని అన్నారు. సంబంధం లేని విషయాల్లో టెహ్రాన్‌పై అనవసర ఆరోపణలు చేస్తే.. అమెరికాకు గట్టి ఎదురు దెబ్బ తగులుతుందని హెచ్చరించారు.

ఇటీవల అగ్రరాజ్యం హూతీలపై వరుస దాడులు చేస్తోంది. ఈ విషయంపై ట్రంప్ మాట్లాడుతూ.. హూతీలను ఆకతాయి మూకలు, దుండగులుగా పేర్కొన్నారు. వారు చేసే దాడులను భారీ సైన్యంతో దీటుగా ఎదుర్కొంటామని చెప్పారు. అది అక్కడితో ఆగుతుందనే హామీ కూడా ఇవ్వలేనన్నారు. 'బాధితుడి' పాత్ర పోషించిన ఇరాన్.. నియంత్రణ కోల్పోయామని చెబుతున్నప్పటికీ అది నిజం కాదన్నారు. హూతీల ప్రతి కదలికలను నిర్దేశిస్తోందని, ఆయుధాలు, నగదు, అత్యాధునిక సైనిక సామగ్రితోపాటు నిఘా సమాచారాన్ని పంచుకుంటోందని ఆరోపించారు. ప్రపంచ జలమార్గాల్లో అమెరికా వాణిజ్య, నౌకాదళ నౌకలను ఏ ఉగ్రవాద దళమూ ఆపలేదని అన్నారు.

ఇటీవల యెమెన్ రాజధాని సనా సహా పలు నగరాలపై అమెరికా యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. రెండురోజుల పాటు కొనసాగిన దాడుల్లో కనీసం 53 మంది మృతి చెందగా.. అనేక మంది గాయపడ్డారు. మరోవైపు హూతీలు మాత్రం తాము తగ్గేదే లేదని, గాజాకు అండగా ఉంటూ.. ఎలాంటి సవాళ్లు ఎదురైనా పాలస్తీనియన్లకు సాయం చేస్తామని చెబుతున్నారు.

# డేవిడ్ మిల్లర్ ఎమోషన్స్‌తో ఆడుకోవద్దు

## లఖ్‌నవూ మేనేజ్‌మెంట్‌పై విమర్శలు

శనివారం నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ విడుదల చేసిన ఓ వీడియో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎల్ఎస్‌జీ ప్లేయర్, దక్షిణాఫ్రికా క్రికెటర్ డేవిడ్ మిల్లర్ 'హార్ట్ బ్రేక్' క్షణాలు ఏంటనే దానిపై స్పెషల్‌గా ఓ వీడియోను రూపొందించింది. ఆఖర్లో ఇచ్చిన క్యాప్షన్ ఇప్పుడు నెట్టింట దుమారం రేపింది. ఇంతకీ ఆ వీడియోలో ఏముంది? మిల్లర్ ఏం చెప్పాడు? ఫ్యాన్స్ ఎలా రియాక్ట్ అయ్యారో చూద్దాం.




గత ఐపీఎల్ మెగా వేలంలో డేవిడ్ మిల్లర్‌ను ఎల్ఎస్‌జీ రూ.7.5 కోట్లకు దక్కించుకుంది. గుజరాత్ టైటాన్స్ రిటైన్ చేసుకోని విషయం తెలిసిందే. మార్చి 24న దిల్లీ క్యాపిటల్స్‌తో లఖ్‌నవూ తొలి మ్యాచ్ ఆడనుంది. దీంతో తమ జట్టు ప్రమోషన్ కోసం మిల్లర్‌తో సోషల్ మీడియా ఇన్‌ఫ్ల్యూన్సర్ శుభమ్ గౌర్ చిట్‌చాట్ నిర్వహించాడు. ఈ సందర్భంగా నాకౌట్ మ్యాచుల్లో ఓడిపోవడం వల్ల మనసు విరిగిన ఘటనలు ఏంటనే ప్రశ్నలు అడిగాడు. దానికి సమాధానం ఇచ్చిన మిల్లర్ 'టీ20 ప్రపంచకప్ ఫైనల్ ఓటమి' తనను మరింత బాధ పెట్టిందని చెప్పాడు. ఛాంపియన్స్ ట్రోఫీ సెమీస్‌లోనూ సఫారీ జట్టుకు చుక్కెదురైన సంగతి తెలిసిందే. 'ఈ సీజన్ నీ హార్ట్‌బ్రేక్‌లను జీరో చేసేస్తుంది' అని క్యాప్షన్ ఇచ్చింది. దీంతో మిల్లర్ ఎమోషన్స్‌తో ఇంటర్వ్యూలు చేయడం అవసరమా? అనే విమర్శలు రావడం మొదలెట్టాయి. "ఈ వీడియోను చూసేందుకు నాకు చాలా అసౌకర్యంగా అనిపించింది. డేవిడ్ మిల్లర్‌కు నేను పశ్చాత్తాపం వ్యక్తంచేస్తున్నా. అతడి ముందే వరుసగా వైఫల్యాలను అడుగుతూ ఉంటే అక్కడే ఉండటం చాలా బాధగా అనిపించింది" "లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సోషల్ మీడియా టీమ్‌ను తొలగించండి. ఇది చాలా బాధాకరం. అత్యంత దారుణమైన ప్రశ్నలు" "ఇది చాలా తీవ్ర భావోద్వేగం కలిగించే వైఖరి. లఖ్‌నవూ ఎప్పటికీ గొప్ప జట్టు కాలేదు. ప్లేయర్లతో ఎలా ఉండాలో వారికి తెలియదు" "అతడేమన్నా మూరు?డా? ఇలాంటి వ్యక్తికి ఇంటర్వ్యూ చేయమని లఖ్‌నవూ ఎలా పర్మిషన్ ఇచ్చిందో అర్థం కావడం లేదు. దక్షిణాఫ్రికా ఓటముల గురించి ఇప్పుడెందుకు?"

# ఉప్పల్‌లో ఐపీఎల్ మ్యాచ్

## 2700 మంది పోలీసులతో భారీ భద్రత



హైదరాబాద్:
మార్చి 22 నుంచి ఐపీఎల్ 2025 ప్రారంభం కానున్న వేళ రాచకొండ పోలీసులు అప్రమత్తమయ్యారు. మార్చి 23న ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగే మ్యాచ్‌కు ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేశారు. మొత్తంగా 2700 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉప్పల్ స్టేడియంలో 450 సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోనే ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ఏసీపీ సారథ్యంలో భద్రతను పర్యవేక్షించనున్నారు.

మరోవైపు, స్టేడియం ఎంట్రన్స్ వద్ద స్నిపర్ డాగ్స్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టనున్నారు. క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు వచ్చే మహిళల కోసం మహిళా భద్రతా విభాగం బృందాలను ఏర్పాటు చేశారు. అభిమానుల కోసం ఐదు చోట్ల ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వాటర్ బాటిల్స్, ల్యాప్‌టాప్, అగ్గిపెట్టెలు, పలు ఎలక్ట్రానిక్ వస్తువులను నిషేధించినట్లు పోలీసులు తెలిపారు. ఐపీఎల్ మ్యాచ్ ఉన్న రోజుల్లో నగరంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు నడవనున్నాయి.

# ఒకప్పుడు రంజీ.. ఇప్పుడు ఐపీఎల్

## ఆటగాళ్ల కెరీర్‌ను మెరిపిస్తున్న టోర్నీ

ప్రస్తుతం టీమ్ ఇండియా వైట్‌బాల్ క్రికెట్‌లో తిరుగులేని జట్టుగా నిలిచింది. ముఖ్యంగా 2007 తర్వాత ఈ మార్పు స్పష్టంగా మొదలైంది. గతంలో జట్టులో స్థానం దక్కాలంటే రంజీ, దులీప్ ట్రోఫీ వంటి దేశవాళీ టోర్నీల్లో రాణించాల్సిందే. కానీ, ఐపీఎల్‌తో ఇప్పుడు యువ క్రికెటర్లకు జట్టులో వైల్డ్‌కార్డ్ ఎంట్రీ లభిస్తోంది. అంతేకాదు.. వీరిలో చాలామంది టీమ్ ఇండియాకు ఎంపికవుతున్నారు. ముఖ్యంగా బ్యాటర్లు ఇక్కడి అనుభవంతో మైదానంలో అంతర్జాతీయ స్థాయి బౌలింగ్ వేసే వారిని కూడా అలవోకగా ఎదుర్కొంటున్నారు. అలా జట్టులోకి అడుగుపెట్టి తమ స్థానాలు సుస్థిరం చేసుకొన్న ఆటగాళ్లు ఎందరో..




### స్వయం కృషితో సిరాజ్..

హైదరాబాద్‌కు చెందిన ఓ ఆటోడ్రైవర్ కుమారుడైన సిరాజ్ పూర్తిగా స్వయంకృషితోనే బౌలింగ్‌ను మెరుగుపర్చుకొన్నాడు. 2015లో తొలిసారి రంజీ ట్రోఫీ ఆడాడు. ఆ సీజన్‌లో 41 వికెట్లు సాధించాడు. అతడిలో సత్తాను గుర్తించిన సన్‌రైజర్స్ హైదరాబాద్ రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. ఆ తర్వాతి సీజన్‌లోనే అతడిని ఆర్సీబీ రూ.2.6 కోట్లకు సొంతం చేసుకొంది. అంతేకాదు.. టీమ్ ఇండియా పేస్ దళంలో సిరాజ్ కీలకంగా మారాడు. 2023 ఆసియాకప్ ఫైనల్స్‌లో శ్రీలంకను ఒంటిచేత్తో కుప్పకూల్చి భారత్‌కు టైటిల్ అందించాడు.

### రూ.10తో అవసరాలు తీర్చుకొన్న జడ్డూ..

ఓ ప్రైవేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డ్ కుమారుడైన రవీంద్ర జడేజా చాలా చిన్నస్థాయి నుంచి ఎదిగాడు. క్రికెట్ కెరీర్ తొలినాళ్లలో రోజుకు కేవలం రూ.10తో అవసరాలు తీర్చుకొనేవాడు. 2008 అండర్-19 ప్రపంచకప్‌లో అద్భుతంగా రాణించడంతో.. అతడు ఐపీఎల్ ఫ్రాంఛైజీల కళ్లల్లో పడ్డాడు. రాజస్థాన్ రాయల్స్ అదే ఏడాది అతడిని కొనుగోలు చేసింది. ఇక కెరీర్‌లో జడ్డూ వెనుదిరిగి చూడాల్సిన అవసరం రాలేదు. 2023లో చెన్నై జట్టు అతడిని రూ.16 కోట్లకు సొంతం చేసుకొంది.

### నూడుల్స్ తిని కడుపునింపుకొన్న పాండ్యా బ్రదర్స్..

మరో స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కూడా పేద కుటుంబం నుంచి వచ్చిన ఆటగాడే. అతడి కుటుంబం బరోడాలోని ఓ చిన్న ఇంట్లో నివాసం ఉండేది. అప్పట్లో అతడి తండ్రి హార్దిక్, కృనాల్ క్రికెట్ కోచింగ్, చిన్నాచితకా పనులు చేసేవాడు. ఇద్దరు సోదరులు కొన్నాళ్లు మ్యాగీ నూడుల్స్ మాత్రమే తిని కడుపు నింపుకొన్న రోజులు ఉన్నాయి. దేశవాళీలో రాణించడంతో.. 2015లో ముంబయి ఇండియన్స్ అతడిని రూ.10 లక్షలకు కొనుగోలు చేసింది. 2022లో గుజరాత్ టైటాన్స్ రూ.15 కోట్లకు దక్కించుకొంది. అతడిని ముంబయి జట్టు భారీ ధరకు తిరిగి దక్కించుకొంది.

### ఫినిషర్‌గా ఆశాకిరణం రింకూ సింగ్..

వైట్‌బాల్ క్రికెట్‌లో టీమ్ ఇండియాలో ఫినిషర్ స్థానానికి ఆశాకిరణంగా మారిన రింకూసింగ్ ప్రతిభ ఐపీఎల్‌తోనే వెలుగులోకి వచ్చింది. 2014లోనే దేశవాళీ క్రికెట్‌లో వివిధ జట్లకు ఆడిన రింకూను 2017లో పంజాబ్ జట్టు దక్కించుకొంది. ఆ తర్వాతి సంవత్సరమే కోల్‌కత్తా జట్టు అతడిని తీసుకొంది. 2023 ఐపీఎల్ సీజన్‌లో గుజరాత్‌పై జరిగిన మ్యాచ్‌లో అతడు చివరి ఓవర్లో ఏకంగా 5 సిక్స్‌లు కొట్టి జట్టుకు విజయాన్ని అందించాడు. ఆ ఇన్నింగ్స్‌తో ఐపీఎల్‌లో హాట్ ప్లేయర్‌గా మారాడు.

### టెంట్‌లో జీవించిన జైస్వాల్..

క్రికెట్ మీద ప్రేమతో యూపీ నుంచి ముంబయికి వచ్చిన కుర్రాడు యశస్వీ జైస్వాల్ ఆర్థిక స్థోమత సహకరించకపోయినా.. మైదానంలోని టెంట్‌లో ఉంటూ క్రికెట్ ఆడాడు. పొట్టకూటి కోసం పానీపూరీలు కూడా విక్రయించాడు. దేశవాళీ క్రికెట్‌లో మెరుపులు మెరిపించాడు. 2020లో రాజస్థాన్ జట్టు అతడిని తీసుకొంది. అక్కడినుంచి అతడి బ్యాటింగ్ మెరుపులు మొదలయ్యాయి. ఇప్పటికే టీమ్ ఇండియా టీ20, టెస్ట్ జట్లలో స్థానం ఖాయం చేసుకొన్నాడు. వన్డేల్లో ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్నాడు.

### గురుద్వారాలో కొన్నాళ్లు పంత్..

ఇక ఉత్తరాఖండ్‌లో జన్మించిన పంత్ 12వ ఏటే దిల్లీకి వచ్చేశాడు. కానీ, ఆర్థికంగా స్థితిమంతుడు కాకపోవడంతో మోతీబాగ్‌లోని గురుద్వారాలో కొన్నాళ్లు ఉండాల్సివచ్చింది. చివరికి సన్‌నెట్ హెడ్‌కోచ్ తారక్ సిన్హాపంత్‌కు ఒక రూమ్‌ను ఏర్పాటుచేశాడు. ఆ తర్వాత ఎయిర్‌ఫోర్స్ స్కూల్‌లో స్కాలర్‌షిప్ సాధించాడు. 2015-16 సీజన్ దిల్లీ తరఫున రంజీ జట్టులో స్థానం సంపాదించాడు. 2016లో దిల్లీ ఐపీఎల్ జట్టు అతడిని రూ.1.9 కోట్లు ఇచ్చి జట్టులోకి తీసుకొంది. నాటినుంచి అతడు కెరీర్‌లో వెనుదిరిగి చూడలేదు.

### సమ్మర్‌క్యాంప్ నుంచి నితీశ్ రెడ్డి

ఆరేళ్ల వయస్సులో సమ్మర్ క్యాంప్‌తో నితీశ్ రెడ్డి క్రికెట్ ప్రస్థానం మొదలైంది. కుమారుడు ఆటలో రాణిస్తుండటంతో తండ్రి ముత్యాలరెడ్డి ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని పూర్తికాలం అతడి వెంటే ఉన్నారు. ఒక దశలో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. నితీశ్ శిక్షణలో లోటు రానీయలేదని తల్లి మానస ఓ సందర్భంలో చెప్పారు. 2023లో సన్‌రైజర్స్ అతడిని రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. ఆ సీజన్‌లో రెండు మ్యాచ్‌ల్లోనే ఆడాడు. కానీ, 2024 సీజన్‌కు వచ్చేసరికి 303 పరుగులు చేసి.. ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్‌ను దక్కించుకొన్నాడు. అదే ఏడాది అక్టోబర్‌లో టీమ్ ఇండియా టీ20కు ఎంపికవ్వడంతో.. అతడి అంతర్జాతీయ ప్రస్థానం ప్రారంభమైంది.

# అవన్నీ అవాస్తవాలు.. మాకు నష్టాలు రాలేదు..

## 10 మిలియన్ డాలర్లు ఆర్జించాం: పీసీబీ




ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమ్‌ఇండియా నిలిచిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్ ఆతిథ్యంలో ఈ టోర్నీ జరిగింది. అయితే, ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు భారీ నష్టాలు వచ్చాయని కథనాలు వచ్చాయి. అయితే, తమకు లాభాలు వచ్చాయని తాజాగా పీసీబీ వెల్లడించింది. దాదాపు 10 మిలియన్ డాలర్ల (పాక్ రూపాయల్లో 280 కోట్లు) ఆదాయం వచ్చిందని తెలిపింది. లాహోర్, కరాచీ, రావల్పిండి స్టేడియాల ఆధునీకీకరణ చేసేందుకు పెద్ద మొత్తం ఖర్చు చేయడంతో నష్టాలు ఎదుర్కోవాల్సి వచ్చిందనేది అవాస్తవమని కొట్టిపడేసింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు అధికారిక ప్రతినిధి ఆమిర్ మిర్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ జావెద్ ముర్తాజా ఖర్చులు, ఆదాయం విషయంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదని మీడియాకు వెల్లడించారు.

"టోర్నమెంట్ నిర్వహణకు సంబంధించి అన్ని ఖర్చులను ఐసీసీ భరించింది. టికెట్ల అమ్మకాలు, ఇతరాలతో పీసీబీకి ఆదాయం వచ్చింది. ఆడిట్ తర్వాత ఐసీసీ నుంచి మాకు అదనంగా రూ.92 కోట్లు వస్తాయని భావిస్తున్నాం. మేం అనుకొన్న లక్ష్యాలను ఇప్పటికే అధిగమించాం. ఈ టోర్నీ నిర్వహణ ద్వారా అనుకొన్న దానికంటే భారీగానే ఆదాయం మాకు వచ్చింది. ప్రభుత్వానికి ట్యాక్స్ రూపంలోనే రూ.1.20 కోట్లు చెల్లించాం. ఛాంపియన్స్ ట్రోఫీ నిర్వహణతో పీసీబీ ప్రపంచంలోనే మూడో ధనవంతమైన బోర్డుగా మారనుంది. కేవలం నాలుగు నెలల్లోనే స్టేడియాల రెన్నోవేషన్ చేశాం. ఇదంతా పీసీబీ చీఫ్ మోసిన్ నక్వీ చొరవతోనే సాధ్యమైంది. ప్లేయర్ల జీత భత్యాల్లో కోత విధింపు నిర్ణయాన్ని పీసీబీ ఛైర్మన్ వెనక్కి తీసుకున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ అనంతరం.. పాకిస్థాన్ నుంచి ఏ ప్రతినిధిని ట్రోఫీ అందజేసే పోడియం పైకి ఆహ్వానించకపోవడంపై ఐసీసీని వివరణ అడిగాం. దానికోసం వేచి చూస్తున్నాం. త్వరలోనే ఛాంపియన్స్ ట్రోఫీకి సంబంధించి ఆర్థికపరమైన అంశాలను అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచుతాం. ఇక్కడ ప్రతి విషయమూ పారదర్శకంగానే ఉంటుంది" అని వెల్లడించారు.



# సమంతకు ఉత్తమ నటి అవార్డు

**సమంతకు ఓటీటీ ఉత్తమ నటి అవార్డు - 'హనీ-బన్నీ' సిరీస్‌లో నటనకు గుర్తింపు**
**తనను నమ్మినవారికి అవార్డును అంకితం చేసిన సమంత**
**రాజ్ అండ్ డీకే, వరుణ్‌లకు కృతజ్ఞతలు**



సమంత... తెలుగులోనే కాదు, హిందీ, తమిళం వంటి ఇతర భాషల్లోనూ ప్రతిభావంతమైన నటిగా గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల కాలంలో ఆమె తెలుగులో నటించిన సినిమాలు ఏవీలేవు. అయినప్పటికీ వెబ్ సిరీస్ ల ద్వారా అభిమానులను అలరిస్తూనే ఉంది. అమ్మడి క్రేజ్ ఇప్పటికీ తగ్గలేదంటే అతిశయోక్తి కాదు. తాజాగా సమంతకు ఓటీటీలో ఉత్తమ నటి అవార్డు లభించింది. 'హనీ-బన్నీ' సిరీస్‌లో అద్భుతమైన నటన కనబరిచినందుకు ఒక ప్రముఖ మీడియా సంస్థ ఆమెను ఈ పురస్కారంతో సత్కరించింది. ఈ అవార్డును అందుకోవడం పట్ల సమంత తన సంతోషాన్ని వ్యక్తం చేసింది. ప్రతికూల పరిస్థితుల నడుమ 'హనీ-బన్నీ' సిరీస్‌ను పూర్తి చేయడమే తనకు ఒక అవార్డు అని సమంత పేర్కొంది. తనను నమ్మిన వారందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నట్లు ఆమె తెలిపింది. రాజ్ అండ్ డీకే, వరుణ్ ధావన్‌ల వల్లే తాను 'సిటాడెల్ హనీ-బన్నీ'ని పూర్తి చేయగలిగానని సమంత చెప్పింది. సిరీస్‌ను పూర్తి చేయడానికి వారు ఎంతో ఓపికతో వ్యవహరించారని, తనను ఎంతో జాగ్రత్తగా చూసుకున్నారని ఆమె కృతజ్ఞతలు తెలిపింది. సిటాడెల్ హనీ బన్నీ షూట్ సమయంలో సమంత మయోసైటిస్ వ్యాధితో బాధపడిన సంగతి తెలిసిందే. సుదీర్ఘకాలంపాటు చికిత్స పొందిన సమంత ప్రస్తుతం కోలుకుని ఫిట్ గా తయారైంది.

# కూతురు సితారతో మహేశ్ బాబు యాడ్..

## క్యూట్ వీడియో చూశారా?

తన తండ్రి మహేశ్ బాబుతో కలిసి సితార తాజాగా ఓ యాడ్‌లో నటించింది. ఈ యాడ్ తాలూకు వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతోంది. ఇందులో సితార-మహేశ్‌ను చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. షాపింగ్ బాగా ఎంజాయ్ చేశాం కదా అంటూ మహేశ్ అనగానే... అవును నాన్నా అంటూ ఆయనపై ఓ డ్రెస్ విసిరేస్తుంది సితార. దాంతో వెంటనే మహేశ్ కాస్ట్యూమ్ మారిపోతుంది. అలా మహేశ్ కూడా సితారపై బట్టలు విసురుతారు. అలా ఒకరిపై ఒకరు బట్టలు విసురుకుంటూ తండ్రికూతురు కొత్త కాస్ట్యూమ్స్‌లో కనిపిస్తూ సందడి చేస్తుంటారు. ప్రస్తుతం ఈ యాడ్ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక ఈ యాడ్‌లో మహేశ్ కొంచెం గడ్డంతో క్లాసిక్ లుక్‌లో కనిపించారు. ఇక సితార అయితే చిరునవ్వులతో ఎంతో క్యూట్‌గా కనిపించింది. కాగా, మహేశ్ బాబు సినిమాల విషయానికి వస్తే ప్రస్తుతం ప్రముఖ దర్శకుడు ఎస్-ఎస్ రాజమౌళి డైరెక్షన్‌లో ఓ మూవీలో నటిస్తున్నారు. ఈ చిత్రం ఎస్-ఎస్29 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతోంది. సూపర్ స్టార్ పక్కన ప్రియాంకా చోప్రా నటిస్తున్న ఈ సినిమాలో కీలక పాత్రలో పృథ్వీరాజ్ సుకుమారన్ కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని టాలీవుడ్ సీనియర్ నిర్మాత కేఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. ఇక ఈ మూవీ యాక్షన్ అడ్వెంచర్‌గా ఉంటుందని కథా రచయిత విజయేంద్రప్రసాద్ ఇప్పటికే వెల్లడించారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హాలీవుడ్ టెక్నీషియన్స్ కూడా భాగం కానున్నారు.




## తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన

# యాంకర్ శ్యామల



తెలంగాణ : బెట్టింగ్ యాప్ వ్యవహారంలో యాంకర్ శ్యామల తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. బెట్టింగ్ కేసులో తన మీద నమోదైన ఎఫ్ఐఆర్ ను క్వాష్ చేయాలని శ్యామల తన పిటిషన్ లో పేర్కొన్నారు. అయితే, ఆ పిటిషన్ పై నేడు హైకోర్టులో విచారణ జరగనుంది. బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేసినందుకు పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో శ్యామలపై కేసు నమోదైంది. ఆంధ్ర 365 అనే ఆన్ లైన్ గేమింగ్ యాప్ కు యాంకర్ శ్యామల ప్రమోషన్ చేశారు. సామాజిక మాధ్యమాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లకు ప్రచారం చేసిన కేసులో టీవీ యాంకర్ విష్ణుప్రియ, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్ రీతూచౌదరిలను పంజాగుట్ట పోలీసులు నిన్న సుదీర్ఘంగా విచారించిన విషయం తెలిసిందే.




# పవన్ కల్యాణ్ 'హరిహర వీరమల్లు' డబ్బింగ్ పనులు ప్రారంభం

**పవన్ ప్రధాన పాత్రలో హరిహర వీరమల్లు - క్రిష్ / జ్యోతికృష్ణ డైరెక్షన్ లో చిత్రం**

**మే 9న వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్**

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో క్రిష్/జ్యోతికృష్ణ డైరెక్షన్ లో రూపుదిద్దుకుంటున్న చిత్రం హరిహర వీరమల్లు... స్వోర్డ్ ఆఫ్ స్పిరిట్ అనేది ట్యాగ్ లైన్. మెగా సూర్య ప్రొడక్షన్ బ్యానర్ పై ఏఎం రత్నం సమర్పణలో వస్తున్న ఈ పీరియాడిక్ యాక్షన్ మూవీ మే 9న ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తాజాగా ఈ చిత్రం డబ్బింగ్ పనులు ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు మేకర్స్ అప్ డేట్ ఇచ్చారు. అసమాన హీరోయిజంను తెరపై చూసేందుకు కొన్నిరోజుల సమయం మాత్రమే ఉంది అంటూ పేర్కొన్నారు. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన నిధి అగర్వాల్ కథానాయికగా నటించింది. ఆస్కార్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఎంఎం కీరవాణి సంగీతం అందించారు.

# 'పెళ్లి కాని ప్రసాద్' నటనతో ఆకట్టుకున్నసప్తగిరి

**సప్తగిరి గురించి తెలుగు ప్రేక్షకులకు కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. తనదైన కామెడీ టైమింగ్‌తో అందరిని ఆకట్టుకున్నాడు. ఆయన ఓ కమెడియన్‌గా మంచి పాపులారిటీ పొందిన సమయంలోనే హీరోగా మారి 'సప్తగిరి ఎక్స్‌ప్రెస్' మరియు 'సప్తగిరి ఎల్ఎల్‌బీ' వంటి సినిమాలతో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. చాలా గ్యాప్ తరువాత మళ్లీ హీరోగా నటించిన సినిమా 'పెళ్ళి కాని ప్రసాద్'. ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు రాగా, అది ఎలా ఉందో ఈ సమీక్ష ద్వారా తెలుసుకుందాం.**




ప్రసాద్ (సప్తగిరి) మలేషియాలో ఒక స్టార్ హోటల్‌లో పని చేస్తూ ఉంటాడు. అతని వయసు 38 సంవత్సరాలు. అయితే పెళ్లి విషయమై అతని తండ్రి (మురళీధర్) ఒక కండిషన్ పెడతాడు. వారి పూర్వీకుల సంప్రదాయం ప్రకారం కనీసం రెండు కోట్ల కట్నం లేకపోతే పెళ్లి చేసుకోవద్దని చెప్పడంతో, ప్రసాద్ అలాంటి సంబంధం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. అదే సమయంలో, అతనికి ప్రియ (ప్రియాంక శర్మ) పరిచయం అవుతుంది. ఆమె తన తల్లిదండ్రులతో కలిసి విదేశాల్లో సెటిల్ అవ్వాలని కలలు కంటూ ఉంటుంది.

ప్రసాద్ ధనికుడని భావించి ప్రియ అతనిని ట్రాప్ చేస్తుంది. ఇద్దరూ ప్రేమలో పడి పెళ్లి చేసుకుంటారు. అయితే పెళ్లి అయిన తర్వాత ప్రసాద్ మలేషియాకు వెళ్లకూడదని ప్రియ డిమాండ్ చేస్తుంది. అప్పటివరకు పెళ్లి కాని ప్రసాద్ ఇక పెళ్లైన తర్వాత ఎలాంటి సమస్యలను ఎదుర్కొన్నాడు? చివరికి ఈ కథ ఏమిటనేది సినిమా మూలాంశం.

**నటీనటుల ప్రతిభ**

ఈ సినిమాలో సప్తగిరి ప్రధాన భారం మోసాడు. వన్ మాన్ ఆర్మీలా తన కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకులను నవ్వించేందుకు ప్రయత్నించాడు. పెళ్లి విషయంలో బాధపడే, ప్రేమలో పడిన కుర్రాడిగా మంచి నటన ప్రదర్శించాడు. ముఖ్యంగా తన పెళ్లి తన కోసమే కాదని, తన డబ్బు కోసమని తెలుసుకున్నప్పుడు వచ్చే ఎమోషనల్ సన్నివేశాల్లో ఆకట్టుకున్నాడు. మురళీధర్ గౌడ్ పాత్రకు మంచి ప్రాధాన్యత ఉంది. ఇతర నటులైన అన్నపూర్ణమ్మ, ప్రమోదిని, పాషా తమ తమ పాత్రలను చక్కగా పోషించారు.

**సాంకేతిక విభాగం**

ఈ సినిమా టెక్నికల్‌గా చాలా బాగుంది. ముఖ్యంగా సంగీత దర్శకుడు శేఖర్ చంద్ర అందించిన పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు హైలైట్‌గా నిలిచాయి. కొన్ని సన్నివేశాల్లో వాడిన మీమ్ కంటెంట్ యూత్‌కి బాగా కనెక్ట్ అయ్యింది. సినిమాటోగ్రఫీ సినిమాకు రిచ్ లుక్ తీసుకువచ్చింది. ఇంట్రడక్షన్ సాంగ్‌తో పాటు కొన్ని పాటల చిత్రీకరణ ఆకర్షణీయంగా ఉంది. డైలాగ్స్ కొంతవరకు నవ్విస్తూ, ఆలోచింపజేసేలా ఉన్నాయి.

**దర్శకుడి కథన శైలి**

దర్శకుడు పూర్తిగా కామెడీ ప్రధానంగా సినిమాను రూపొందించాడు. కథలో పెద్దగా కొత్తదనం లేకపోయినా, సిచువేషనల్ కామెడీ బాగా వర్కౌట్ అయ్యింది. కొన్ని చోట్ల కామెడీ బాగా పేలింది. అయితే కొన్ని చోట్ల మాత్రం కామెడీ ఫ్లాట్ అయింది. ముఖ్యంగా క్లైమాక్స్ విషయంలో మరికొంత శ్రద్ధ తీసుకుని ఉంటే బాగుండేది. ప్రేక్షకులను పూర్తిగా ఎంటర్‌టైన్ చేయడమే లక్ష్యంగా సినిమా నిర్మించినట్లు తెలుస్తోంది.

విశ్లేషణజి

పెళ్లి కాని ప్రసాద్ సినిమా కథ కొత్తదేమీ కాదు. మనం ఇలాంటి కథలను గతంలో ఎన్నోసార్లు చూశాం. పెళ్లికి సంబంధించి కొన్ని సమస్యలు, కుటుంబం మరియు ప్రేమ మధ్య విభేదాలపై ఆధారపడిన కథ ఇది. సినిమా మొదటి భాగం కామెడీతో ఆకట్టుకోగా, రెండో భాగంలో చిన్న ఎమోషనల్ డ్రామా చోటు చేసుకుంది. స్క్రీన్‌ప్లే కొంతవరకు చక్కగా ఉన్నప్పటికీ, కొన్ని సన్నివేశాల్లో కథ కాస్త నెమ్మదించిన ఫీలింగ్ కలిగిస్తుంది.

**ఫైనల్ వెర్డిక్ట్**

'పెళ్ళి కాని ప్రసాద్' సినిమా పూర్తిగా కామెడీ ప్రధానంగా రూపొందించబడింది. కథలో పెద్దగా కొత్తదనం లేకున్నా, కామెడీ లవర్స్‌కి ఒకసారి చూడదగిన సినిమాగా చెప్పవచ్చు. ఓవరాల్‌గా, నవ్వించేందుకు ప్రయత్నించిన సినిమా ఇది.

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339